ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739

# తెలుగోడు

EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com

సంపుటి-1 | సంచిక - 131 | సోమవారం 9 ఫిబ్రవరి 2026 | పేజీలు - 8 వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati




## శ్రీశైలంలో మహాశివరాత్రి

# బ్రహ్మోత్సవం

- 11రోజుల పాటు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవం..
- యాగశాల ప్రవేశం, ధ్వజారోహణతో ప్రారంభం..
- మహాశివరాత్రినాడు నంది వాహన సేవతో మహోత్సవ శిఖరం..
- దర్శన విధానాల్లో మార్పులు, భక్తుల సౌకర్యాలనికి ప్రత్యేక ఏర్పాట్లు..



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**

శ్రీశైలంలో వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ప్రతీ సంవత్సరం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అత్యంత ఘనంగా నిర్వహించే ఈ ఉత్సవాలకు నేడు శాస్త్రోక్తంగా అంకురార్పణ జరగడంతో ఉత్సవ వాతావరణం సంతరించుకుంది.పన్నెండు జ్యోతిర్లింగాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన శ్రీశైలం మల్లికార్జున స్వామిని మహాశివరాత్రి రోజున దర్శించుకోవడం అత్యంత (మిగతా 2లో)



# స్థానిక సంస్థల వేడి

- షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వ కసరత్తు..
- ఏప్రిల్ చివర్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఫోకస్..?
- కూటమి పార్టీలో అభ్యర్థుల ఎంపికకు ముందస్తు వ్యూహాలు.
- జనగణన వేళ ఎన్నికల నిర్వహణపై అధికార వర్గాల్లో సందేహాలు...

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల దిశగా రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి పెట్టగా, ప్రభుత్వం షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనతో ముందుకెళ్తున్నట్లు సమాచారం. గ్రామ పంచాయతీల నుంచి ప్రారంభించి, ఆపై మండల, జిల్లా పరిషత్‌లు, చివరగా మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేలా దశలవారీ ప్రణాళికను ఖరారు చేసే కసరత్తు కొనసాగుతోంది. ఎన్నికల నిర్వహణకు సాంకేతికంగా ఎలాంటి అడ్డంకులు లేకపోతే నిర్ణీత కాలపట్టిక ప్రకారమే ముందుకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు (మిగతా 2లో)

## బ్రిటీష్ పాలనకు మించిన కూటమి అరాచకం..రాష్ట్రంలో

# అప్రకటిత ఎమర్జెన్సీ

- పోలీసులను అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలు..
- అంబటిపై తప్పుడు కేసులు, అరెస్టు, దౌర్జన్యం..
- కూటమిని ప్రశ్నిస్తే దాడులే సమాధానాలా..?
- గాయపడ్డ సింహం మరింత ప్రమాదం.. కాకాణి గోవర్ధన్‌రెడ్డి



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**

కూటమి ప్రభుత్వం నాటి బ్రిటిష్ పాలనను కూడా మించిపోయేలా వ్యవహరిస్తోందని, రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ, పోలీసులను అడ్డు పెట్టుకుని రాజకీయ ప్రత్యర్థులపై దాడులు చేయించడం కూటమి ప్రభుత్వ దౌర్జన్య పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. మాజీ మంత్రి అంబటి రాంబాబుపై తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా అరెస్టు చేయడంతో పాటు ఆయన నివాసంపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచినట్లేనని విమర్శించారు. అంబటి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పేందుకే తాము వచ్చామని, కష్టసమయంలో కూడా ఆ కుటుంబం ధైర్యంగా నిలబడటం అభినందనీయమని తెలిపారు.రాష్ట్రంలో జరుగుతున్న అనేక అంశాలపై అంబటి (మిగతా 2లో)

# పవన్ బాటలో విజయ్

- ప్రజాదరణే ఓట్లుగా మార్చే సమరానికి సిద్ధం..
- చెన్నై నుంచి తొలి పోరు.. వి అనే అక్షర నియోజకవర్గాలపై గురి..
- భారతీయ జనతాపార్టీ సిద్ధాంత శత్రువు..
- ద్రావిడ ముందేటి సంఘం రాజకీయ ప్రత్యర్థి..
- స్థానిక ఎన్నికల విజయంతో శాసన సభపై భారీ ఆశలు..



**చెన్నై (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**

ఇక్కడ పవన్ కల్యాణ్... అక్కడ విజయ్. సినిమాలతో సంపాదించిన అపార ప్రజాదరణను రాజకీయ శక్తిగా మలుచుకుంటూ ఇద్దరూ తమ తమ రాష్ట్రాల్లో కీలక పాత్రధారులుగా ఎదుగుతున్నారు. సుదీర్ఘ రాజకీయ పోరాటం అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ఉప ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన పవన్ కల్యాణ్ ప్రయాణమే ఇప్పుడు తమిళనాట నటుడు విజయ్‌కు రాజకీయ దారిగా మారింది. పవన్ అనుసరించిన పోరాట పద్ధతి, ప్రజలతో మమేకమయ్యే శైలి, ఎన్నికల వ్యూహాలే విజయ్ రాజకీయ ప్రస్థానానికి ప్రేరణగా మారుతున్నాయి.రాబోయే తమిళనాడు శాసనసభ ఎన్నికలు హోరాహోరీగా మారనున్న నేపథ్యంలో తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ తన తొలి ఎన్నికల సమరానికి సిద్ధమయ్యారు. శాసనసభలో అడుగు పెట్టాలనే లక్ష్యంతో ఆయన నియోజకవర్గాల ఎంపికపై (మిగతా 2లో)

## బీహార్ నవ నిర్మాణానికి

# పీకే పిలుపు

- రెండున్నర నెలల తర్వాత క్రియాశీలక రాజకీయాల్లోకి రీ ఎంట్రీ..
- బగాహా నుంచి బీహార్ నవ నిర్మాణ్ అభియాన్‌కు శ్రీకారం..
- డబుల్ ఇంజిన్ సర్కార్‌పై తీవ్ర విమర్శలు..



**బగాహా (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**

జన్ సురాజ్ అధినేత ప్రశాంత్ కిషోర్ మరోసారి క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల అనంతరం రెండున్నర నెలల రాజకీయ విరామం తర్వాత ఆదివారం బగాహా నుంచి 'బీహార్ నవ నిర్మాణ్ అభియాన్'ను లాంఛనంగా ప్రారంభించారు. ఎన్నికల్లో ఎదురైన ఓటమితో వెనకడుగు వేయకుండా, రాబోయే ఐదేళ్లలో పార్టీ సంస్థను క్షేత్రస్థాయిలో పటిష్టం చేయాలని కార్యకర్తలకు ఆయన స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. బగాహా లోని ఐబీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన కార్యకర్తల సదస్సులో ప్రశాంత్ కిషోర్ రాష్ట్రంలో కొనసాగుతున్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో తాను విద్య, ఉపాధి వంటి మౌలిక సమస్యలను ప్రజల ముందుకు తీసుకొచ్చినా, ప్రభుత్వం ఆర్థిక ప్రలోభాలతో ప్రజలను తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. మహిళలకు రెండు లక్షల రూపాయల హామీపై కూడా ప్రశ్నలు లేవనెత్తిన ఆయన, ఇప్పుడు ఆ హామీ అమలుపై ప్రజలే సమాధానం కోరుతున్నారని వ్యాఖ్యానించారు.ఆర్జేడీ, కాంగ్రెస్ మధ్య విభేదాల అంశంపై స్పందించిన కిషోర్, ఎన్నికల ద్వారా ప్రజలే అన్ని పార్టీల పాత్రలను స్పష్టంగా నిర్ణయించారని తెలిపారు. ఎన్డీఏకు పాలన బాధ్యత, ఆర్జేడీకి ప్రతిపక్ష పాత్ర, జన్ సురాజ్‌కు ప్రజా (మిగతా 2లో)

## భారత్-అమెరికా ట్రేడ్ డీల్

# రైతాంగానికి ఉరితాళ్లే



- వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌లకు అప్పగించే కుట్రగా రైతు సంఘాల ఆగ్రహం..
- ఈనెల 12న దేశవ్యాప్త నిరసనలకు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు..
- కేంద్ర మంత్రి పియూష్‌గోయల్ రాజీనామాకు డిమాండ్..
- ట్రేడ్ డీల్‌పై సంతకాలు చేయొద్దని ప్రధాని మోడీకి హెచ్చరిక..

**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**

భారత్, అమెరికా మధ్య కుదరనున్న వాణిజ్య ఒప్పందం భారత రైతాంగానికి తీవ్ర నష్టం చేకూరుస్తుందని రైతు సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ట్రేడ్ డీల్ ద్వారా భారత వ్యవసాయ రంగం తన మనుగడనే కోల్పోయే ప్రమాదం ఉందని, దేశంలోని వ్యవసాయ వ్యవస్థ మొత్తం అమెరికా కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆరోపిస్తున్నారు. ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎమ్), అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్)తో పాటు పలు రైతు సంఘాలు ఫిబ్రవరి 12న దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. ఈ వాణిజ్య ఒప్పందం భారతీయ వ్యవసాయ రంగాన్ని అమెరికా కార్పొరేట్ సంస్థలకు అప్పగించడమేనని రైతు సంఘాల నాయకులు విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. ఒప్పందంపై కేంద్ర (మిగతా 2లో)

## గిరిజన విద్యార్థుల అస్వస్థతపై

# చంద్రబాబు సీరియస్




- మారేడుపల్లి ఆశ్రమ హాస్టల్ ఘటనపై అత్యవసర సమీక్ష..
- సమగ్ర నివేదిక వెంటనే ఇవ్వాలని అధికారులకు ఆదేశం..
- ఫుడ్ పాయిజనింగ్ అనుమానం, ఆహార నాణ్యతపై లోతైన విచారణ..
- 92మంది విద్యార్థులు అస్వస్థత, ఆరోగ్య పరిస్థితి విషమం..

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**

పోలవరం జిల్లా మారేడుమిల్లి మండలం దేవరపల్లి గిరిజన ఆశ్రమ బాలుర వసతి గృహంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనను అత్యంత సీరియస్‌గా తీసుకున్న సీఎం ఆదివారం అమరావతిలోని సచివాలయంలో సంబంధిత అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యంతో రాజీ పడేది లేదని స్పష్టం చేసిన సీఎం, హాస్టళ్లలో విద్యార్థులకు ఏ చిన్న ప్రమాదం జరిగినా ముందుగా బాధ్యత వహించిన అధికారులపై చర్యలు తీసుకుని, ఆ తర్వాతే ఇతర విషయాలు చర్చిస్తానని హెచ్చరించారు.ఈ ఘటనపై రేపటిలోగా (ఫిబ్రవరి 9లోపు) పూర్తి స్థాయి, సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి, ముఖ్యంగా ఆహార నాణ్యత, వంట ప్రక్రియ, (మిగతా 2లో)

## మంచు కుటుంబంపై

# కిడ్నాప్ కేసు

### సినీ, పొలిటికల్ సర్కిల్స్‌లో కలకలం



**తిరుపతి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**

మంచు మోహన్ బాబు విశ్వవిద్యాలయానికి సంబంధించిన విద్యార్థి నేతల కిడ్నాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నటుడు, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణుపై కేసు నమోదు కావడంతో ఈ వ్యవహారం ఇప్పుడు సినీ, రాజకీయ వర్గాల్లో సంచలనంగా (మిగతా 2లో)

# స్థానిక సంస్థల వేడి

(మొదటి పేజీ (తరువాయి)

తెలుస్తోంది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ఏప్రిల్ నెలాఖరు లోగా ముందుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేలా ఏర్పాట్లు ముమ్మరం అవుతున్నాయి. పంచాయతీ ఎన్నికల అనంతరం పరిషత్ ఎన్నికలు, ఆపై పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దిశగా స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికల నిర్వహణపై అధికార యంత్రాంగం ఇప్పటికే ఫీల్డ్ స్థాయిలో అంచనాలు సిద్ధం చేస్తుండగా, ఎన్నికల సంఘం నుంచి తుది సంకేతాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం సెన్సెస్ ప్రారంభించనున్న నేపథ్యంలో, సెన్సెస్ సమయంలో ఎన్నికల నిర్వహణ సాధ్యమా? అనే అంశంపై అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. సెన్సెస్ ప్రక్రియ దాదాపు ఏడాది పాటు కొనసాగే అవకాశం ఉండటంతో, సెన్సెస్ పూర్తయ్యే వరకు ఎన్నికలు వాయిదా పడే అవకాశముందా? లేక ముందుగానే ఎన్నికలు పూర్తి చేస్తారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై కేంద్రాన్ని సంప్రదించి స్పష్టత కోరినట్లు సమాచారం. ఎన్నికల నిర్వహణకు చట్టపరమైన, సాంకేతిక ఇబ్బందులు లేకపోతే షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలకు వెళ్లాలన్న అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. పులివెందులలో ఇటీవల జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నికల ఫలితం తర్వాత కూటమి పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాయి. ఈ ఫలితం కూటమి పార్టీల్లో ఉత్సాహాన్ని నింపినట్లు తెలుస్తోంది. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ముందస్తు వ్యూహాలు ఖరారు చేస్తున్నట్లు సమాచారం. మూడు కూటమి పార్టీల నుంచి పెద్ద ఎత్తున ఆశావాహులు ఉండటంతో, అభ్యర్థుల ఎంపికలో అసంతృప్తి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సామాజిక సమీకరణలు, స్థానిక పరిస్థితులు, గెలుపు అవకాశాలను పరిగణలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు వైసీపీ వైఖరి మాత్రం ఇంకా స్పష్టతకు రాలేదు. స్థానిక సంస్థల ఎన్నికల అంశంపై పార్టీ లోపల విస్తృత చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని, అదే తమకు అనుకూలంగా మారుతుందన్న అంచనాల్లో వున్నట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలే రాజకీయంగా పార్టీకి బలమైన పునాది కావడంతో ఎలాగైనా తమ సత్తా చాటాలన్న అభిప్రాయం వైసీపీలో వివిపిస్తోంది. ఇదిలా ఉండగా, స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటికే సీఎం చంద్రబాబు పార్టీ క్యాడర్‌ను సమాయత్తం కావాలని సూచించినట్లు సమాచారం. ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని స్థానిక ఎన్నికల్లో ప్రతిబింబింపజేయాలన్న లక్ష్యంతో కూటమి పార్టీలు ముందుకు సాగుతున్నాయి. మొత్తం మీద సెన్సెస్ అంశం, ఎన్నికల షెడ్యూల్, పార్టీల వ్యూహాలు అన్నీ కలిసి ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ఆసక్తికరంగా మారుస్తున్నాయి. ఈ ఎన్నికలపై తీసుకునే నిర్ణయాలు రాష్ట్ర రాజకీయాలపై దీర్ఘకాల ప్రభావం చూపే అవకాశం ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ

(మొదటి పేజీ (తరువాయి)

రాంబాబు ప్రశ్నించడమే ఆయనపై దాడులకు కారణమని, ప్రశ్నించే గొంతులను అణచివేయడమే కూటమి పాలన లక్ష్యంగా మారిందని కాకాణి ఆరోపించారు. లడ్డూ వివాదం విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అబద్ధాలు ఆడారని, సమాధానం చెప్పలేక దాడులు చేయిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. కూటమి పాలన పూర్తిగా అధ్వాన్నంగా మారిందని, ప్రజల సమస్యలపై మాట్లాడే నాయకులపై పోలీసుల ద్వారా వేధింపులు చేయడం అరాచక పాలనకు నిదర్శనమని అన్నారు. గర్జించే సింహం కన్నా గాయపడ్డ సింహమే మరింత ప్రమాదకరం అన్న విషయాన్ని కూటమి నేతలు గుర్తుంచుకోవాలని హెచ్చరిస్తూ, పైశాచిక ఆనందం పొందటం తప్ప ఈ చర్యల వల్ల వారికి ఎలాంటి ఫలితం ఉండదని స్పష్టం చేశారు. చంద్రబాబు పూర్తిగా వ్యక్తిత్వం కోల్పోయారని, తనను విమర్శించినందుకే అరెస్టులు చేయించడం దుర్మార్గపు రాజకీయానికి నిదర్శనమని కాకాణి వ్యాఖ్యానించారు. వైఎస్సార్సీపీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అక్రమాలకు పాల్పడినవారు తట్టుకోలేరని హెచ్చరిస్తూ, అంబటి రాంబాబు తుపాకి తూటాలకు కూడా భయపడని ధైర్యవంతుడని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు కాకాణి పూజిత మాట్లాడుతూ, కష్టసమయంలో మౌనిక తండ్రి బాధ్యతను భుజాన వేసుకుని ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కొంటోందని ప్రశంసించారు. ఇలాంటి పరిస్థితుల్లో అంబటి కుటుంబాన్ని కలవాల్సి వస్తుందని తాము ఎప్పుడూ ఊహించలేదని, రాజకీయాలు అత్యంత దిగజారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌కు సైన్యంలా నిలబడే భావనను కూటమి నేతలే తమ చర్యలతో పెంచుతున్నారని, అవసరమైతే ప్రాణాలర్పించైనా జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. కూటమి పాలన స్వరూపాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, మహిళల పట్ల కనీస గౌరవం లేని ప్రభుత్వం ఇది అని విమర్శించారు. ప్రభుత్వం చేసే తాటాకు బెదిరింపులకు వైఎస్సార్సీపీ శ్రేణులు భయపడబోవని ఆమె హెచ్చరించారు.

# పవన్ బాటలో విజయ్

(మొదటి పేజీ (తరువాయి)

వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. చెన్నైలోని వేళచ్చేరి, విరుగంబాక్కం నియోజకవర్గాలను ప్రధానంగా పరిశీలిస్తూ స్థానిక అనుకూలతలు, ప్రజల స్పందనను తెలుసుకునేందుకు ప్రజాభిప్రాయ అధ్యయనాలు చేయిస్తున్నారు. 'వి' అక్షరంతో ప్రారంభమయ్యే నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనే ఆలోచనతో చెన్నైలోని వేళచ్చేరి, విరుగంబాక్కం, విల్లుపురం జిల్లాలోని విక్రవాండి, నాగపట్టినం జిల్లాలోని వేదారణ్యం, కరూర్ జిల్లాలోని వేదసందూర్ నియోజకవర్గాలపై విజయ్ దృష్టి పెట్టారు. ప్రస్తుతం ఆయన నివాసం ఉన్న పనైయూర్‌కు వేళచ్చేరి సమీపంలో ఉండటం, ఆయన తల్లిదండ్రులు విరుగంబాక్కంలో నివసించటం ఈ రెండు నియోజకవర్గాలకు మరింత ప్రాధాన్యత తీసుకొచ్చింది. విక్రవాండిలో నిర్వహించిన పార్టీ తొలి భారీ బహిరంగ సభకు లభించిన విశేష స్పందన ఆ నియోజకవర్గంపై ప్రత్యేక ఆశలు పెంచింది. రాజకీయ ప్రత్యర్థుల విషయంలో విజయ్ స్పష్టతతో తన వైఖరిని వెల్లడించారు. భారతీయ జనతా పార్టీని సిద్ధాంత శత్రువుగా, ద్రావిడ మున్నేటి సంఘాన్ని రాజకీయ ప్రత్యర్థిగా ప్రకటించడం తమిళ రాజకీయాల్లో కలకలం రేపింది. అదే సమయంలో రాబోయే ఎన్నికల్లో తమతో కలిసి నడిచే పార్టీలతో అధికారాన్ని పంచుకోవడానికి సిద్ధమని ఆయన చేసిన ప్రకటన కూటమి రాజకీయాలకు కొత్త దిశను సూచిస్తోంది. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ్ అభిమాన సంఘం అభ్యర్థులు 115 స్థానాల్లో విజయం సాధించడంతో పార్టీకి పునాది స్థాయిలో బలం ఉందని స్పష్టమైంది. ఈ ఉత్సాహంతో శాసనసభ ఎన్నికల్లోనూ ప్రభావం చూపేందుకు విజయ్ సిద్ధమవుతున్నారు. త్వరలోనే పార్టీ అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నట్లు సమాచారం. ఫలితంగా తమిళనాడు రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలవుతుందా? కొత్త ప్రభుత్వంలో విజయ్ పాత్ర ఎంత కీలకం కానుందన్నది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది.

# మంచు కుటుంబంపై కిడ్నాప్ కేసు



(మొదటి పేజీ (తరువాయి)

మారింది. తిరుపతి పరిధిలోని మంచు మోహన్ బాబు యూనివర్సిటీలో అధిక ఫీజుల వసూళ్లపై నిరసనలకు దిగిన విద్యార్థి సంఘాల నేతలపై జరిగిన ఘటన ఈ కేసుకు కారణమైంది. భారీ ఫీజులు దోపిడీ చేస్తున్నారంటూ ఎస్ఎఫ్ఐ నేతలు కలెక్టరేట్ ముట్టడికి సిద్ధమవుతుండగా, కాలేజీ వద్ద ఉద్రిక్తత నెలకొంది.

ఈ క్రమంలో యూనివర్సిటీకి చెందిన బౌన్సర్లు ఇద్దరు విద్యార్థి నేతలను బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారని ఆరోపణలు వెల్లువెత్తాయి. అక్బర్, వినోద్ అనే విద్యార్థి నాయకులపై దాడులు చేసి, కిడ్నాప్‌కు పాల్పడ్డారని పోలీసులు వద్ద ఫిర్యాదు నమోదైంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమై కారును వెంబడించి, ఘటనకు కారణమైన పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ నెల 3వ తేదీన ఈ కేసులో మోహన్ బాబు, మంచు విష్ణు, పీఆర్వో సతీష్‌తో పాటు మొత్తం 13 మందిపై కిడ్నాప్ కేసు నమోదు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజాగా ఈ కేసులో పోలీసులు మంచు విష్ణుకు నోటీసులు జారీ చేయడంతో వ్యవహారం మరింత హీట్ పెరిగింది. చంద్రగిరి, తిరుచానూరు పోలీసులు రెండు నోటీసులు పంపిస్తూ మూడు రోజుల్లో విచారణకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇప్పటికే పలు సినిమా షూటింగ్‌ల షెడ్యూల్స్ ఖరారై ఉన్నాయని పేర్కొంటూ, ఫిబ్రవరి 15 తర్వాత విచారణకు హాజరవుతానని మంచు విష్ణు లిఖితపూర్వకంగా పోలీసులకు తెలియజేశారు. ఈ కేసులో ఏ1గా పీఆర్వో సతీష్, ఏ2గా మంచు విష్ణు, ఏ3గా మోహన్ బాబు పేర్లను పోలీసులు నమోదు చేశారు. ఈ ఘటనతో మరోసారి మంచు కుటుంబం వార్తల్లో నిలిచింది. మరోవైపు అధిక ఫీజుల వసూళ్లను ప్రశ్నిస్తే అరెస్టులు, కిడ్నాప్ కేసులు ఏంటని విద్యార్థి సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో పీఆర్వో సతీష్‌తో పాటు పలువురు బౌన్సర్లు అరెస్టు కావడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై మోహన్ బాబు ఏపీ హైకోర్టును ఆశ్రయించి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో కిడ్నాప్ కేసులో మంచు మోహన్ బాబు, మంచు విష్ణు భవితవ్యం ఏమవుతుందన్నది రాజకీయ, సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవం



(మొదటి పేజీ (తరువాయి)

పుణ్యప్రదమని భావించే భక్తులు దేశ నలుమూలల నుంచి తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో నేటి నుంచి ఈనెల 18వ తేదీ వరకు 11 రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభ సందర్భంగా ఆలయ యాగశాలలో శాస్త్రోక్తంగా యాగశాల ప్రవేశం నిర్వహించారు. ఆలయ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈవో శ్రీనివాసరావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, వేదపండితులు గణపతిపూజ, శివసంకల్పం, చండీశ్వరపూజ, కంకణాధారణ, అఖండ దీపారాధన, వాస్తు పూజ, వాస్తు హోమం వంటి అనేక విశేష పూజలను నిర్వహించి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వైభవంగా శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సుమారు 15 లక్షల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జర్మన్ షెడ్లు ఏర్పాటు చేసి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అలాగే భక్తుల కోసం 40 లక్షల లడ్డూలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. నిరంతరం నాలుగు క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. నేటి నుంచి ఈనెల 12వ తేదీ వరకు ఇరుముడి కలిగిన శివస్వాములకు మాత్రమే స్వామివారి స్పర్శ దర్శనానికి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు.

ఈ సంవత్సరం కూడా ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు ఉచితంగా 50 గ్రాముల లడ్డూలను భక్తులకు అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 15, 16 తేదీల్లో క్షేత్రానికి వచ్చే వాహనాలకు టోల్ ఫీజులు మినహాయించి అనుమతి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. భక్తులకు సహాయంగా శివసేవకుల ద్వారా క్షేత్రంలో 12 ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే సెల్‌ఫోన్‌లో వన్ స్టాప్ సొల్యూషన్ యాప్ ద్వారా భక్తులు తాము చేరాల్సిన ప్రదేశాలకు సులభంగా చేరుకునేలా ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆలయ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈవో శ్రీనివాసరావు తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగనున్నాయని వారు పేర్కొన్నారు.

## రూ 10 ఓపీతో ప్రాణాలు నిలుపుతున్న

# మంగళగిరి ఎయిమ్స్

## కార్పొరేట్ వైద్యానికి దీటుగా అత్యాధునిక చికిత్సలు

## డబ్బుల్లేని వారికి ధన్వంతరిగా ఎయిమ్స్ సేవలు



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**

ప్రస్తుత కార్పొరేట్ ఆసుపత్రుల యుగంలో లక్షలు ఖర్చు పెట్టినా వైద్యం అందుతుందో లేదో అన్న సందేహాలు ఉన్న వేళ, కేవలం పది రూపాయల ఓపీతోనే అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రులు మన దేశంలో ఉన్నాయి అంటే ఆశ్చర్యం కాదు. అత్యాధునిక సౌకర్యాలు, ఖరీదైన ఎక్విప్మెంట్, నిపుణులైన వైద్య బృందంతో కార్పొరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో సేవలు అందిస్తున్న ఆసుపత్రులలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎయిమ్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. లక్షల రూపాయలు ఖర్చయ్యే శస్త్రచికిత్సలు కూడా కేవలం ?10 ఓపీతో జరిగే చోటుగా ఎయిమ్స్ నిలుస్తోంది అంటే, సామాన్య ప్రజలకు వైద్యం ఎంతగా అందుబాటులో ఉందో చెప్పడానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనం. అలాంటి ఎయిమ్స్‌లలో ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరి ఎయిమ్స్ పేద ప్రజలకు వరంగా మారింది. డబ్బుల్లేక వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ఈ ఆసుపత్రి నిజంగా ఒక దేవాలయంలా మారిందని చెప్పాలి. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అత్యాధునిక చికిత్సలు, అది కూడా కేవలం పది రూపాయల ఓపీతో అందుతుండటంతో మంగళగిరి ఎయిమ్స్ సామాన్య ప్రజల పాలిట ధన్వంతరిగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో అక్కడ అందుతున్న సేవలపై సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టులు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీస్తున్నాయి. ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న ఒక యువకుడికి మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు చేసిన చికిత్స అందరికీ ఆశ్చర్యం కలిగించింది. అతని మెదడులో ఏర్పడిన బ్లడ్ క్లాట్‌ను అత్యాధునిక ఎక్విప్మెంట్ సహాయంతో శస్త్రచికిత్స ద్వారా తొలగించి ప్రాణాలను కాపాడారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో అయితే లక్షల రూపాయలు ఖర్చయ్యే ఈ ఆపరేషన్, మంగళగిరి ఎయిమ్స్‌లో మాత్రం కేవలం ?10 ఓపీతోనే జరిగిందని సోషల్ మీడియాలో పేర్కొంటున్నారు. ఈ ఘటన ఎయిమ్స్ సేవల స్థాయిని చాటిచెప్పే ఉదాహరణగా నిలిచింది. ఇదే తరహాలో మరో ఘటన కూడా ప్రజలను కదిలిస్తోంది. ఆరు నెలల క్రితం ఒక వ్యక్తి రెండు కిడ్నీలు పూర్తిగా దెబ్బతిని మంగళగిరి ఎయిమ్స్‌ను ఆశ్రయించగా, కుటుంబ సభ్యులు కిడ్నీ డొనేట్ చేశారు. ఎయిమ్స్‌లోని నిపుణులైన వైద్య బృందం కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. దీంతో ఆ వ్యక్తి కొత్త జీవితాన్ని పొందినట్లయిందని, అతనికి ఇది నిజమైన పునర్జన్మగా మారిందని సోషల్ మీడియాలో భావోద్వేగంగా వర్ణిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే కార్పొరేట్ స్థాయి వైద్యం నిజంగా సామాన్యులకు శుభవార్త అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మంగళగిరి ఎయిమ్స్‌లో చేరితే వైద్య చికిత్సతో పాటు అవసరమైన మందులు, భోజనం తదితర సేవలు కూడా ఉచితంగానే అందుతున్నాయని, ఒక్క రూపాయి కూడా ఖర్చు కావడం లేదని వైరల్ పోస్టులు పేర్కొంటున్నాయి. ఈ సమాచారం ఎక్కువ మంది పేద ప్రజలకు చేరాల్సిన అవసరం ఉందని, డబ్బుల్లేక వైద్యం మానేయాల్సిన పరిస్థితి ఇక లేదని, మంగళగిరి ఎయిమ్స్ ఆశగా నిలుస్తోందని సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.

## హెడ్ కానిస్టేబుల్ సురేష్ కు

# ప్రభుత్వ లాంఛనాలతో అంత్య క్రియలు

**పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**

**ప్రగాఢ సానుభూతి తెలిపిన శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్**

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ కోర్టులో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సురేష్ (హెచ్‌సీ--2295) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహానికి ఆదివారం అనంతపురంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అనంతపురం రాజీవ్ కాలనీకి చెందిన సురేష్ 1996 సంవత్సరంలో సివిల్ కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరారు. అనంతరం హెడ్ కానిస్టేబుల్‌గా రాయదుర్గం, బత్తలపల్లి, పెనుకొండ ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం పెనుకొండ కోర్టులో విధులు నిర్వర్తిస్తూ ఉన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం మృతుని కుటుంబానికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు సురేష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతపురంలోని జేఎన్టీయూ సమీపంలోని క్రైస్తవుల స్మశాన వాటికలో జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో పెనుకొండ సీఐ రాఘవన్, ఆర్ఐ వల్లి, పెనుకొండ ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, ఉమ్మడి జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, పోలీస్ సిబ్బంది, బ్యాచ్‌మేట్లు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# బీహార్ నవనిర్మాణానికి పీకె పిలుపు

(మొదటి పేజీ (తరువాయి)

ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేసే బాధ్యత లభించిందని వివరించారు. బీహార్ నవ నిర్మాణ్ అభియాన్'లో భాగంగా ప్రతి జిల్లాలో ఒకటి నుంచి రెండు రోజులు గడుపుతూ గ్రామస్థాయిలో పర్యటనలు చేపడతామని తెలిపారు. కార్యకర్తలు, ప్రజలతో నేరుగా సంభాషిస్తూ, సంస్థను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను లోతుగా అర్థం చేసుకోవడమే ఈ ప్రచార ప్రధాన లక్ష్యమన్నారు.

సదస్సు అనంతరం ప్రశాంత్ కిషోర్ బగాహ్ బజార్‌తో పాటు నర్వల్‌బర్వల్ ప్రాంతాల్లో పర్యటించి స్థానిక ప్రజలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భారతి, ఎమ్మెల్సీ అఫాక్ అహ్మద్, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబు సీరియస్

(మొదటి పేజీ (తరువాయి)

హైజీన్ ప్రమాణాలు, వంట సిబ్బంది పర్యవేక్షణ వంటి అంశాలపై వివరమైన విశ్లేషణ నివేదిక ఇవ్వాలని సూచించారు. నిర్లక్ష్యం లేదా విధి విరుద్ధ ప్రవర్తన తేలితే ఎలాంటి మొహమాటం లేకుండా సస్పెన్షన్, డిపార్ట్‌మెంటల్ ఇన్వెస్టిగేషన్ వంటి కఠిన చర్యలు తప్పవని సీఎం స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హాస్టళ్లలో ఆహార సరఫరా వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు ఆరోగ్య పర్యవేక్షణను మరింత కఠినంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దేవరపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల బాలుర హాస్టల్‌లో మొత్తం 92 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థుల్లో వాంతులు, కడుపునొప్పి, జ్వరం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించడంతో హాస్టల్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ప్రాథమికంగా ఇది ఫుడ్ పాయిజనింగ్ ఘటనగా అధికారులు అంచనా వేస్తున్నారు. సరిగా వండని ఇడ్లీ, సాంబార్ వంటి ఆహారం వడ్డించడం లేదా హైజీన్ లోపాల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా మారడంతో వారిని తొలుత మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, అనంతరం మెరుగైన చికిత్స కోసం రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. ప్రస్తుతం బాధిత విద్యార్థులందరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో బాధ్యత వహిస్తూ చర్యలు చేపడుతుందని అధికారులు స్పష్టం చేశారు.


# రైతాంగానికి ఉరి తాళ్లే

(మొదటి పేజీ (తరువాయి)

మంత్రి పీయూష్ గోయల్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని ఆరోపించిన వారు, ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ట్రేడ్ డీల్‌పై సంతకాలు చేయవద్దని ప్రధాని నరేంద్ర మోదీని కోరిన ఎస్‌కేఎమ్, ఒకవేళ ప్రభుత్వం ముందుకు వెళ్తే దేశవ్యాప్తంగా మరింత ఉద్ధృత నిరసనలు చేపడతామని హెచ్చరించింది. అమెరికా నుంచి దిగుమతి అయ్యే మొక్కజొన్న, సోయాబీన్ నూనె వంటి పశుగ్రాస ఉత్పత్తులు భారత మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతాయని, ముఖ్యంగా డెయిరీ రంగం దీర్ఘకాలిక నష్టాన్ని ఎదుర్కొంటుందని అఖిల భారత కిసాన్ సభ పేర్కొంది. ఈ ఒప్పందం ద్వారా అమెరికా, ఐరోపా సమాఖ్య ఆర్థిక వ్యవస్థలకే అధిక ప్రయోజనం చేకూరుతుందని, భారతదేశానికి మాత్రం పెద్దగా లాభం లేదని రైతు సంఘాలు అభిప్రాయపడ్డాయి. తమ నిరసనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని నరేంద్ర మోదీల దిష్టిబొమ్మలను దహనం చేస్తామని క్రాంతికారీ కిసాన్ యూనియన్ నేతలు ప్రకటించారు. ఇప్పటికే తక్కువ ఆదాయం, అప్పులతో కుంగిపోయిన రైతుల పరిస్థితిని ఈ ఒప్పందం మరింత దారుణంగా మారుస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డీల్ ప్రభావం గురించి గ్రామాల్లో రైతులు తమను ప్రశ్నిస్తున్నారని భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్ తెలిపారు. రైతులంతా ఈ నిరసనల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని

# తిరుమలలో భక్తుల రద్దీ

## సేవలు, సౌకర్యాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన టీటీడీ ఈవో రవిచంద్ర



**తిరుమల (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. కేవలం ఒక్కరోజు మొత్తం 67,085 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వారిలో 24,832 మంది తలనీలాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అదే ఒక్క రోజులో హుండీ ద్వారా 3.78 కోట్ల రూపాయల ఆదాయం తిరుమల తిరుపతి దేవస్థానానికి లభించింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 23 కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. టోకెన్ లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి 12 నుంచి 14 గంటల వరకు సమయం పట్టింది. ఇదిలా ఉండగా, టీటీడీ కార్యనిర్వహణాధికారిగా తాజాగా బాధ్యతలు స్వీకరించిన ముద్దాడ రవిచంద్ర క్షేత్రస్థాయిలో పర్యటన చేపట్టారు. శనివారం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి మాతృశ్రీ తరిగొండ వేంగమాంబ అన్నప్రసాద భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించిన ఈవో, భోజన రుచి, నాణ్యతపై భక్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అన్నప్రసాద వడ్డన విధానాలు, సేవలపై భక్తులు వ్యక్తం చేసిన సంతృప్తిని ఆయన స్వీకరించారు.

అనంతరం అన్నప్రసాద విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, శ్రీవారి సేవకులతో ప్రత్యేకంగా మాట్లాడి వారు అందిస్తున్న సేవలను అభినందించారు. అక్కడి నుంచి నేరుగా ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీని సందర్శించిన రవిచంద్ర, మంచినీరు, ఆహార పదార్థాల నాణ్యతకు సంబంధించిన ప్రమాణాలు, పరీక్షా విధానాలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆక్టోపస్ భవనం నుంచి కృష్ణతేజ సర్కిల్ వరకు ఉన్న బయటి క్యూ లైన్లను పరిశీలించిన ఆయన, అనంతరం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, హెడ్ కౌంట్ వంటి విశ్లేషణ వ్యవస్థలను పరిశీలించారు. ఈ సందర్భంగా అమెరికాలో ఉన్న దాత శ్రీ వీ. జయప్రకాశ్‌తో వర్చువల్‌గా మాట్లాడారు. అనంతరం పీఏసీ-5ను సందర్శించిన ఈవో, లాకర్లు, కల్యాణకట్ట, అన్నప్రసాదం, స్మార్ట్ షూ కీపింగ్ సెంటర్ వంటి భక్తుల సౌకర్యాలను పరిశీలించి, వాటిని మరింత సమర్థవంతంగా వినియోగించుకునేలా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తుల సౌకర్యాలే ప్రధాన లక్ష్యంగా టీటీడీ పనిచేస్తుందని ఈవో స్పష్టం చేశారు.



పదవ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస్ మాదిరి పరీక్షలు నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

## పదవ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాస్ మాదిరి పరీక్షలు

**కనేకల్ (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
పదవ తరగతి విద్యార్థులకు ఫైనల్ పరీక్షలు అంటే చాలా భయంగా ఉంటుంది అలాంటి విద్యార్థులకు భయాన్ని పోగొట్టేందుకు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞ వికాస్ మాదిరి పరీక్షలను ఆదివారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ, యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు నరసింహులు ప్రశ్నాపత్రాలు విడుదలచేసి పరీక్షా సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి నెలలో 10వ తరగతి విద్యార్థులకు ఫైనల్ పరీక్షలు ఉన్నాయి అని ఈ పరీక్షలలో విద్యార్థులు భయభ్రాంతులు పడకుండా పరీక్షలు చక్కగా రాసేందుకు ప్రజ్ఞా వికాస్ మాదిరి పరీక్షలు ఎంతో ఉపకరిస్తా యన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థి సమస్యలపై మాత్రమే పోరాటాలే కాకుండా విద్యార్థుల చదువుకో ఉపయోగపడే విధంగా ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వందల మంది విద్యార్థులు పరీక్షలు రాశారని బంధు శివ విద్యార్థుల్లో పరీక్షల భయం రాష్ట్రవ్యాప్తంగా యుపిఎఫ్తో కలిసి ఈ ప్రజ్ఞ వికాస్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ సభా అవకాశాన్ని సద్వినియోగపరచుకొని రాబోవు రోజుల్లో జరుగు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఏ భయభ్రాంతులకు లోను కాకుండా పరీక్షలు సాఫీగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి అత్యున్నతమైన కాలేజీల్లో చేరి ఉన్నత విద్యలు చదవాలని తల్లిదండ్రులకు కుటుంబానికి సహకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వలి,సచిన్, జస్వంత్,భాస్కర్,కిరణ్,చరణ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

## అర్హులైన రైతులకు రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలు

### ఫోటోల పట్టాదార్ పాస్ పుస్తకాలు కనుమరుగు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

**కనేకల్ (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
మండల పరిధిలోని మాల్యం గ్రామంలో అర్హులైన రైతులకు రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలను రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం అర్హులైన రైతుల పట్టాదార్ పాస్ పుస్తకాల పైన జగన్ తన ఫోటోను వేయించి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించారని దేశ చరిత్రలో ఎక్కడ ఏ సీఎం ఇలా పట్టాదార్ పాస్ పుస్తకాలపై తన ఫోటో వేసి ఆ బాసు పాలు అయ్యింది లేదని అది ఒక్క జగన్మోహన్ రెడ్డి అన్నారు. రైతుల భూమిని తన భూమిల దర్జాగా పట్టాదార్ పాస్ పుస్తకాలపై తన ఫోటో వేయించుకోవడం వలన ప్రజల ఆగ్రహానికి గురిగై 11 స్థానాలు అందించడానికి ఇది ఒక ప్రధాన కారణం అన్నారు. అదేవిధంగా పొలాలలో పునాదిరాళ్లపై తన ఫోటో మరియు పేరును వేయించుకున్న పబ్లిసిటీ పిచ్చి సీఎం జగన్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చినప్పటి నుండి రైతులకు అత్యంత గౌరవం అందించాలని రైతుల పక్షపాతి మన సీఎం అన్నారు. ఇప్పటికే పెట్టుబడి సాయం కింద రెండుసార్లు రైతు భరోసా అందించిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి అనేక ఆర్థిక సమస్యలు ఉన్న రైతుల కోసం గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే ధాన్యం కొంటూ డబ్బులు క్షణాల్లో రైతుల బ్యాంక్ ఖాతాల్లో వేస్తూ రైతులకు కావలసిన సబ్సిడీ విత్తనాలు ఎరువులు పెట్టుబడి సహాయం ఇలా మరెన్నో అద్భుతమైన కార్యక్రమాలు రైతుల కోసం చేశారని, మరి ముఖ్యంగా ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు డ్రిప్ ఇరిగేషన్ కింద 90% సబ్సిడీ అందిస్తున్నారని కొనియాడారు. రైతుల కోసం ఇన్ని అద్భుత కార్యక్రమం చేపట్టిన సీఎంని వైసీపీ నాయకులు సూటిపోటి మాటలతో విమర్శించడం తగదన్నారు. రాష్ట్ర దశా దిశా మార్చడానికి ఏడుపదుల వయసులోనూ ఎన్నో అద్భుతమైన ప్రాజెక్టులు, పరిశ్రమలు తీసుకొస్తూ రాజధాని నిర్మాణానికి ఎంతో ప్రయత్నిస్తూ రాబోవు రోజుల్లో యువత ఉద్యోగాలకు భరోసా కల్పిస్తున్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాల విషయంలో ఏదైనా సమస్యలు తెచ్చిన అక్రమాలకు పాల్పడిన చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సీఎం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బ్రహ్మయ్య,ఎంపీడీవో విజయసింహారెడ్డి,పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు లాలెప్ప, మండల టిడిపి కన్వీనర్ వన్నారెడ్డి, ఉప్పర సగర సంఘం డైరెక్టర్ ఆనంద్ రాజ్, చెరువు సంఘం అధ్యక్షుడు బి టి రమేష్, ఆదర్శ భారతి బ్యాంక్ అధ్యక్షులు చంద్రశేఖర్ గుప్తా, మండల మాజీ టీడీపీ కన్వీనర్ సుదర్శన్, చాంద్ భాష శరభన్న గౌడ్, జయరాం చౌదరి, ఉప్పర ప్రభాకర్, యువరాజ్ గౌడ్,అశోక్ గౌడ్, కిష్టప్ప, తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.



అర్హులైన రైతులకు రాజముద్ర తో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే కాలు శ్రీనివాసులు

## దేవరపల్లి హాస్టల్ విద్యార్థుల అస్వస్థత ఘటనపై దర్యాప్తు చేయాలి

### ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్..

**అమరావతి, ఫిబ్రవరి 8:**
పోలవరం జిల్లా రంపచోడవరంలోని దేవరపల్లి ఆశ్రమం బాలుర హాస్టల్‌లో విద్యార్థుల అస్వస్థత ఘటనపై ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ ఆందోళన వ్యక్తం చేశారు . పోలవరం జిల్లా రంపచోడవరం లోని దేవరపల్లి ఆశ్రమ బాలుర హాస్టల్ లో 92 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి, జ్వరం, డయేరియా లక్షణాలుఅనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు . మారేడుమిల్లి, రంపచోడవరం ఏరియా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారి ఆరోగ్యం వివరాలు ఎప్పటికప్పుడు వారి బంధువులకు వివరించాలన్నారు . ఈఘటనపై దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అశ్వర్థంలో భక్త జనసందోహం

### కిటకిటలాడిన క్షేత్రం..

**పెద్దపప్పూరు (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన పెద్దపప్పూరు మండలంలోని అశ్వర్థ నారాయణస్వామి క్షేత్రంలో మూడవ ఆదివారం తిరుణాల సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడానికి ఆంధ్ర కర్ణాటక తెలంగాణ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు పెన్నానదిలో చన్నీటిస్నానమాచరించి నారాయణస్వామి, శ్రీ చక్ర భీమలింగేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అన్నదాన, మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తిరుణాలలో ఎలాంటి



భక్తులకు మజ్జిగను పంపిణీ చేస్తున్న నేత కార్మికులు సురేష్, రఘు



ప్రత్యేక అలంకరణలో అశ్వర్థ నారాయణుడు
ప్రత్యేక అలంకరణలో శ్రీ చక్ర భీమ లింగేశ్వరుడు

అవవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పెద్దవడుగూరు సిఐ రామసుబ్బయ్య, ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరుణాలకు విచ్చేసిన భక్తులు స్వామి దర్శనార్థం క్యూలైన్లో ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఈవో సుబ్రహ్మణ్యం, ఆలయ చైర్మన్ శివ శంకర్ రెడ్డిలు సౌకర్యాలు కల్పించారు.



స్వామి దర్శనార్థం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు. తిరునాళ్లకు భారీగా తరలివచ్చిన భక్తులు

# మహా శివరాత్రి జాగరణ మహోత్సవం పోస్టర్లు ఆవిష్కరణ

### హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు శ్రీపాద వేణు ..

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
నగరంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణమండపంలో మహాశివరాత్రి జాగరణ మహోత్సవం పోస్టర్లను హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు శ్రీపాద వేణు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీపాద వేణు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సౌజన్యంతో దాతల సహకారంతో 15వ తేదీ సాయంత్రం 5 గంటల నుండి మహాశివరాత్రి జాగరణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 16న సోమవార వ్రతం నిర్వహిస్తున్నామన్నారు. ఈ వ్రతంలో దంపతులు గానీ, వ్యక్తిగతంగా కానీ వ్రతంలో పాల్గొనవచ్చునన్నారు. మహాశివరాత్రి మహెూత్సవంలో ప్రజలందరూ పాల్గొని పరమశివుని కృపకు పాత్రులు కావాలన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా రాజమండ్రికి చెందిన శ్రీరామ పీఠం వేద పండితులు ఘనపాటి పాల్గొంటారన్నారు. పార్థవ లింగాలకు వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహిస్తామన్నారు, శ్రీ శ్రీ దత్తాత్రేయ పీఠం పరంపరలో శిష్యులైన శ్రీ రాఘవేంద్ర మాణిక్య ప్రభు మహారాజ్ ఆధ్యాత్మిక భాషణం ఉంటుందన్నారు. గురువుల చేత విద్యార్థులకు



మహా శివరాత్రి జాగరణ మహోత్సవం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు శ్రీపాద వేణు

కాలభైరవ కంకణాలు, రుద్రాక్షలు ఇస్తామన్నారు .భక్తులు తమ స్వహస్తాలతో పార్థవ లింగాలకు అభిషేకాలు చేసే ఆదిశంకరుని కృపకు పాత్రులు కావాలన్నారు.

శివరాత్రి మహోత్సవాలలో పాల్గొన్న భక్తులలో 30 మందిని ఎంపిక చేసి అరుణాచలం గిరి ప్రదక్షణకు ఉచితంగా తీసుకువెళ్తామన్నారు. ప్రతి ఏడాది శివరాత్రి మహోత్సవ జాగరణకు టీటీడీ కళ్యాణ మండపాలు ఉచితంగా ఇస్తున్న సుధాకర్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రచార మండలి సభ్యులు నాగేశ్వరి, టీటీడీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బాబు రాజశేఖర్ రెడ్డి, రామకృష్ణ, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.



## నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

### జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
ఈనెల 9 వ తేదీన అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించే మంత్రులు, సెక్రటరీలు, హెచ్ఓడిల కాన్ఫరెన్స్ కారణంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రద్దు విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని, ఎవరు అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు రాకూడదని తెలిపారు.

సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి రోజంతా విజయవాడలో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మంత్రులు, సెక్రెటరీల కాన్ఫరెన్స్ జరుగుతుందని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, హెచ్ఓడిలు అందరూ కలెక్టరేట్లో హాజరవుతారని, డివిజన్ స్థాయిలో ఆర్డీవోల ఆధ్వర్యంలో డిఎల్డిఓ, డిఎల్పిఓ, ఇతర డివిజన్ స్థాయి అధికారులు ఆర్డీవో కార్యాలయం నుంచి హాజరు కావాలన్నారు. మండలస్థాయి, మున్సిపాలిటీలలో సంబంధిత తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అందరు మండల స్థాయి అధికారులు ఎంపీడీవో, తహసిల్దార్ కార్యాలయాల్లో ఏదో ఒకచోట అందరూ హాజరు కావాలని తెలిపారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డులలో కూడా సంబంధిత సచివాలయ సిబ్బంది ఫిజికల్ గా సంబంధిత సచివాలయంలోనే ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలన్నారు.

## విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన టీచర్ సస్పెన్షన్

**మదనపల్లె (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
అన్నమయ్య మదనపల్లె జిల్లా గుర్రంకొండ మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన అదే పాఠశాల ఉపాధ్యాయుడిని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం తరిగొండ హై స్కూల్ టీచర్ జాకీర్ బాషా విద్యార్థులనులతో ప్రవర్తించే తీరు ఇబ్బంది పెట్టేలా ఉన్న వీడియోలు



సోషల్ మీడియాలో వైరలయ్యాయి. ఈ క్రమంలో టీచరును విచారించి సస్పెండ్ చేశామన్నారు.

# జనసంద్రంగా మారిన బూదిగుమ్మ

### ముగిసిన బూదిగుమ్మ శ్రీ సంజీవరాయ స్వామి ఉత్సవాలు.. పెన్నానదిలో మాఘ స్నానాలు.. స్వామివార్లను దర్శించుకున్న భక్తులు..

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బెళుగుప్ప మండలం రామసాగరం గ్రామ సమీపంలో పెన్నా నది ఒడ్డున వెలసిన బూదిగుమ్మ శ్రీ సంజీవరాయ స్వామి ( శ్రీ ఆంజనేయ స్వామి ) ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు జ్ఞానేశ్వర స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు వాసుదేవరాయ స్వామి, ఈవో బాబు, ఆలయ కమిటీ చైర్మన్ ఎర్రిస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ శివ శంకరప్ప, ఆలయ సలహాదారులు మురళీకృష్ణ, భక్తుల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ప్రాతఃకాల పూజ శ్రీవారికి అభిషేకం, స్వామివారికి ప్రత్యేకలంకరణ, మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా, కర్ణాటక ప్రాంతం నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి రథోత్సవంలో పాల్గొని, రాత్రికి ఆలయ ప్రాంగణంలో నిద్రించి ఆదివారం ఉదయం ఆలయ సమీపంలోని పెన్నా నది ఒడ్డు ఉన్న శ్రీ సిద్ధేశ్వర స్వామి ఘాట్ వద్ద మాఘ స్నానాలు ఆచరించి "శ్రీ సంజీవరాయ స్వామి గోవిందా... గోవిందా అంటూ స్వామి వారి నామస్మరణంతో దర్శించుకున్నారు. అనంతరం శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని కూడా భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేద పండితులు శ్రీ నిరంజన శర్మ ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం శనివారం నుంచి ఆదివారం వరకు రెండు రోజులపాటు సుందరకాండ హోమం చేశారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ సంజీవరాయ స్వామి

స్వామివారి తిరునాళ్లలో పాల్గొన్న భక్తులకు బళ్లారికి చెందిన వెన్నపూసల కుటుంబ సభ్యులు, శ్రీ రాళ్లపల్లి మనోజ్ మెమోరియల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో సిప్లాన్ గ్రూప్ చైర్మన్ రాళ్ళపల్లి అనంతయ్య, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ అన్న ప్రసాద వితరణ చేశారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తులు తిరునాళ్లలో భాగంగా గాజులఅంగళ్లు, వివిధ రకాల ఆట బొమ్మల దుకాణాల వద్ద కొనుగోళ్లతో కిటకిటలాడాయి. వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు ఎస్ఐ శివ తన సిబ్బందితో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ పద్మావతి వెంకటరమణ స్వామి
శ్రీ పద్మావతి అమ్మవారు



ఆదివారం మాఘస్నానాలు ఆచరించి స్వామి వార్లను దర్శించుకుంటున్న భక్తులతో జనసంద్రంగా మారిన బూదిగుమ్మ ఆలయ ప్రాంగణం



వేద పండితులు శ్రీ నిరంజన శర్మ ఆధ్వర్యంలో సుందరకాండ హోమం నిర్వహిస్తున్న దృశ్యం



భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్‌లు ఎర్రిస్వామి, శివ శంకరప్ప,కమిటీ సభ్యులు, సిప్లాన్ గ్రూప్ చైర్మన్ రాళ్లపల్లి అనంతయ్య,చిత్తూరు డిఎస్పీ సాయినాథ్
వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది. బొమ్మలు, గాజుల కొనుగోళ్లతో సందడిగా మారిన అంగళ్లు

# ఘనంగా శ్రీ మైలార లింగేశ్వరస్వామి ధోనిసేవ

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 8 :** మండల పరిధిలో తమ్మడేపల్లి గ్రామంలో వెలసిన శ్రీ మైలార లింగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ధోని సేవను ఘనంగా ఆలయ యజమానులు మాదాసి కురువ నటరాజు, పూజారి గంగాధర, మాదాసి కురువ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీ మైలార లింగేశ్వర స్వామికి ప్రత్యేకంగా అభిషేకం, కుంకుమార్చన, వివిధ రకాల పూజలు చేసి, శ్రీ మైలార లింగేశ్వర స్వామికి పూలతో అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలో శ్రీ మైలార లింగేశ్వర స్వామి ధోని సేవకు పాలు, అరటి పళ్ళు, ద్రాక్ష పళ్ళు, నెయ్యి తదితర వాటిని పళ్లెంలో వేసి అర్చకులు, గుర వయ్యలతో పూజలు నిర్వహించారు. గుర వయ్యలు ధోని సేవ చుట్టూ ప్రదక్షణలు చేసి, ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి శ్రీ మైలార లింగేశ్వర స్వామికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి తమ మొక్కుబడును తీర్చుకున్నారు. శ్రీ మైలార లింగేశ్వర స్వామి ధోని సేవ కు భక్తులు, మాదాసి కురవ కులస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీ మైలార లింగేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా మంగళహారతి భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.





శ్రీ మైలార లింగేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు. భక్తులు. గురవయ్యల నృత్య ప్రదర్శన





ధోని పూజలు చేస్తున్న భక్తులు గురవయ్యలు. భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం. పాల్గొన్న భక్తులు

# భక్తిశ్రద్ధలతో పాల పొంగులు

**కాటి కోటేశ్వరుడికి ప్రత్యేక పూజలు..**

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :** మాఘమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో మాఘమాస దీక్షలు చేపట్టిన మహిళలు మూడవ ఆదివారం సందర్భంగా దేవాలయాల వద్ద భక్తిశ్రద్ధలతో పాల పొంగుల కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆదివారం తెల్లవారుజామునే భక్తులు సమీప దేవాలయాలకు చేరుకుని స్వామివారికి ప్రదక్షణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కులు చెల్లించుకోవడంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.దేవాలయాల వద్ద మహిళలు కొత్త కుండల్లో పాలు, బియ్యం కలిపి సంప్రదాయబద్ధంగా నైవేద్యాన్ని తయారు చేశారు.అనంతరం వండిన నైవేద్యాన్ని స్వామివారికి సమర్పించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.మండలంలోని సంజీవపురం కాటికోటేశ్వర, సంగమేశ్వర క్షేత్రాలు, కోడేకండ్ల వీరనారాయణ స్వామి ఆలయం, మాల్యవంతం, రామాపురం, డి.చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, ముష్టూరు, పోట్లమర్రి శివాలయం, గంటాపురం అప్పస్వామి దేవాలయాల్లో పాల పొంగుల ఉత్సవం వైభవంగా జరిగింది.మండలవ్యాప్తంగా ప్రధాన ఆలయాల వద్ద భక్తుల రాకతో పండుగ సందడి నెలకొంది.



విశేష పూజలు అందుకుంటున్న కాటి కోటేశ్వరుడు



ఎంపికైన మడకశిర డివిజన్ సర్వేయర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

# మడకశిర డివిజన్ సర్వేయర్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :** రాష్ట్ర విలేజ్ సర్వేయర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల నోటిఫికేషన్ మేరకు సత్యసాయి జిల్లా మడకశిర డివిజన్ ఎన్నికల అధికారి యు.కార్తీక్ సహాయక ఎన్నికల అధికారి ఎన్. చేతన్ ఆధ్వర్యంలో మడకశిర ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం మడకశిర డివిజన్ ఎన్నికలు నిర్వహించారు. విలేజ్ సర్వేయర్ అసోసియేషన్ మడకశిర డివిజన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా టి. మంజునాథ్, ఉపాధ్యక్షులుగా ఎంసి.శశి కిరణ్, కార్యదర్శిగాఎస్.శివరాజ్,సహాయ కార్యదర్శిగా కె.పవన్ కుమార్, కోశాధికారిగా ఎస్ సి.నరేష్, ఉమెన్స్ సెక్రటరీగా సి.జ్యోతి, ఐటీ అండ్ కమ్యూనికేషన్ కార్యదర్శిగా ఎం.రమేష్, వెల్ఫేర్ కార్యదర్శిగా ఎం.రవికుమార్,స్పోర్ట్స్ అండ్ కల్చర్ కార్యదర్శిగా ఎస్ ఆర్.పవన కుమార్, ఆర్గనైజేషన్ సెక్రెటరీగా యు.హరికృష్ణ, లీగల్ అండ్ డిసిప్లీనరీ సెక్రటరీగా డిఆర్.లిఖిత్ కుమార్, సలహాదారుగా వి. దేవన్న ఎన్నికయ్యారు.



మృతి చెందిన దుప్పి

# రైల్వే బ్రిడ్జి గోడను ఢీకొని దుప్పి మృతి

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :** మండల కేంద్రంలోని నల్లబోయినపల్లి సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో దుప్పి మృతి చెందింది. అటవీ ప్రాంతం నుంచి దారి తప్పి వచ్చిన దుప్పి భయాందోళనకు గురై బ్రిడ్జిపై నుంచి దూకే ప్రయత్నంలో గోడను బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. నల్లబోయినపల్లి గ్రామానికి వెళ్లే రహదారిపై ఉన్న రైల్వే బ్రిడ్జిపై దుప్పి అటు ఇటు పరిగెడుతూ ఒక్కసారిగా గోడను ఢీకొని కింద పడిపోయింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని, కొనప్రాణంతో ఉన్న దుప్పికి నీరు తాగించి రక్షించే ప్రయత్నం చేశారు. అయితే తీవ్ర రక్తస్రావం కారణంగా అది అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. స్థానికుల సమాచారంతో బత్తలపల్లి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారులు పశు వైద్యులను పిలిపించి దుప్పికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అటవీ నిబంధనల ప్రకారం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 'అమ్మ నాన్న' ఆశ్రమానికి 50 బస్తాల బియ్యం విరాళం

**అనాథ వృద్ధులకు అండగా నిలిచిన పాత బాలాజీ స్కూల్ యాజమాన్యం..**

**నల్లమాడ (తెలుగోడు), ఫిబ్రవరి 8 :** అనాథల ఆకలిని తీరుస్తూ, వృద్ధుల కన్నీళ్లను తుడుస్తూ సమాజానికి మానవత్వం అంటే ఏమిటో చేతల ద్వారా చాటారు నల్లమాడలోని పాత బాలాజీ స్కూల్ డైరెక్టర్ పోలే వెంకటరెడ్డి, కరస్పాండెంట్ పోలే స్వర్ణలత. తెలంగాణ రాష్ట్రం, యాదగిరి భువనగిరి జిల్లాలోని 'అమ్మ నాన్న' అనాథల వృద్ధాశ్రమంలో నివసిస్తున్న అనాథలు, పీడితుల కష్టాలను గమనించిన వారు తమ వంతు సాయంగా 50 బియ్యం బస్తాలను ఆశ్రమానికి అందజేశారు. ఆకలితో అలమటిస్తున్న వారికి అన్నంగా మారి, ఆశగా నిలిచారు. ఈ సందర్భంగా పోలే వెంకటరెడ్డి మాట్లాడుతూ సమాజంలో మనం సంపాదించిన ప్రతిదీ మనకే కాదు... అవసరంలో ఉన్నవారికి పంచితేనే జీవితానికి అర్థం. అనాథలు, వృద్ధులు ఆకలితో ఉండకూడదన్నదే మా ఆశ అని పేర్కొన్నారు. పోలే స్వర్ణలత మాట్లాడుతూ పిల్లలకు విద్యతో పాటు, మనసులో మానవత్వం నాటాలంటే ముందుగా మనమే ఆచరణలో చూపించాలి. ఇలాంటి సేవలు కొనసాగిస్తాం అని స్పష్టం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు, అనాథలు ఈ సేవకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఆకలికి అన్నం... ఒంటరితనానికి ఓదార్పు...అనాథలకు అండగా నిలిచిన ఈ సేవ నిజంగా అభినందనీయం.



అనాథ వృద్ధాశ్రమంలో పాత బాలాజీ స్కూల్ డైరెక్టర్, కరెస్పాండెంట్

# మంగళగిరి 'నాస్తిక మేళా' జయప్రదం చేయండి

**వాయిస్ ఆఫ్ చార్వాక పిలుపు..**

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :** గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో ఈనెల 14, 15 తేదీలలో నిర్వహించనున్న నాస్తిక మేళాను విజయవంతం చేయాలని వాయిస్ ఆఫ్ చార్వాక సహ సంపాదకులు సత్య నిర్ధారణ, ప్రముఖ ఆర్ఎంపి వైద్యులు నాగేశ్వరరావు, అల్లాబకాస్ పిలుపునిచ్చారు. ఆదివారం బత్తలపల్లిలోని డాక్టర్ నాగేశ్వరరావు నివాసంలో ఈ మేళాకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. సత్య నిర్ధారణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా, అల్లాబకాస్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రెండు రోజుల పాటు జరిగే ఈ మేళాలో ప్రజాశక్తి మాజీ సంపాదకులు శర్మ, జన విజ్ఞాన వేదిక సభ్యులు, పలువురు భౌతికవాదులు, మేధావులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇటువంటి సదస్సులు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. రాయలసీమ నుంచి పెద్ద సంఖ్యలో హాజరు కావాలి రాయలసీమ ప్రాంతానికి చెందిన భౌతికవాదులు, హేతువాదులు, ఆసక్తి గల ప్రజలు ఈ మేళాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికోసం భోజన, వసతి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వాయిస్ ఆఫ్ చార్వాక సహ సంపాదకులు సత్య నిర్ధారణ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

**ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు ..**

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 8 :** మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం 19 లబ్ధిదారులకు 19,50,801 రూపాయలుముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను టీటీడీ బోర్డు మెంబర్, సత్యసాయి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు.అనారోగ్యం తో ఆసుపత్రి లో డబ్బులు చెల్లించి చికిత్స పొందిన 19 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, రాష్ట్ర వక్కలిగా కన్వీనర్ విఎం పాండురంగప్ప,మాజీ సర్పంచ్ గుండుమల చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.





వివరాలు వెల్లడిస్తున్న సిఐ రాజకుమార్

# హత్య కేసులో ముద్దాయి అరెస్టు

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 8 :** మండలంలోని ఎం.రాయపురం గ్రామంలో శనివారం ప్రసన్నకుమార్‌ను తలపై కొట్టి చంపిన కేసులో ముద్దాయి నాగరాజును ఆదివారం ఎం రాయపురం గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద అరెస్టు చేసినట్లు మడకశిర రూరల్ సిఐ రాజ్ కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం ఎం. రాయపురం గ్రామంలో ప్రసన్నకుమార్ ను కట్టెతో బాధడం తో రక్తశ్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసుకొన్నా పోలీస్ లు ముద్దాయి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం ఎం రాయపురం గ్రామ సమీపంలోని ఆంజినేయ స్వామి దగ్గర ఉన్నారన్న సమాచారం తో అరెస్టు చేసినట్లు సి ఐ రాజకుమార్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్ ఐ గౌతమి ఎ ఎస్ ఐ హీదాయాతుల్లా కాన్స్టేబుల్ పాల్గొన్నారు.

## మావోయిస్టుల లొంగుబాటు

**బీజాపూర్, ఫిబ్రవరి 8 :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. బస్తర్ ఐజీ సుందర్ రాజ్. పి. బీజాపూర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ సమక్షంలో మొత్తం 12 మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయారు. వీరిలో ఒక డీవీసీఎం, బెటాలియన్ నెంబర్ 2కు చెందిన ఇద్దరు, పీపీసీఎం ఒకరు, ఏసీఎం ఇద్దరు, పార్టీ సభ్యులు ఇద్దరు, పీఎల్‌జీఏ బెటాలియన్‌కు చెందిన నలుగురు సభ్యులు ఉన్నారు. లొంగిపోయిన వారిపై మొత్తం రూ.54 లక్షల నగదు రివార్డు ఉంది. వీరిలో 8 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు.

# బసవనపల్లి వాసుల తాగునీటి సమస్య పరిష్కారం

**ఎమ్మెల్యే. మాజీ ఎమ్మెల్సీకి ధన్యవాదాలు..**

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 8 :** మండల పరిధిలోని బసవనపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి పరిష్కరించారు. ఇటీవల గ్రామంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి పర్యటించినప్పుడు తాగునీటి సమస్య తీవ్రతపై గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. తక్షణమే స్పందించిన వారు గ్రామంలో బోర్ వేయించారు. దీంతో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి గ్రామస్తులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బసవనపల్లి గ్రామంలో పూజా కార్యక్రమం నిర్వహించి నాయకులు తాగునీరు వదిలారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగిల్ విండో ప్రెసిడెంట్ ఎన్ గణేష్, డైరెక్టర్ దాదా పీర్, డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, నియోజకవర్గం ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు జయకుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బసవనపల్లి పంచాయతీ కూటమి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



దేశం నాయకులకు సన్మానం చేస్తున్న దృశ్యం

**మాధవరెడ్డిని పరామర్శించిన దేశం నాయకులు..**

హనుమంతనపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం సీనియర్ నాయకుడు లక్ష్మీ దేవమ్మ భర్త మాధవరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగిల్ విండో అధ్యక్షులు గణేష్. డైరెక్టర్ దాదా పీర్, మండల్ డీలర్ సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, నియోజకవర్గంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్, పంచాయతీ కన్వీనర్ చంద్రశేఖర్ నాయక్, బూత్ ఇంచార్జ్ మోహన్, శివ కుమార్, డీలర్ రంగస్వామి, రాజశేఖర్ ,ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు తదితరులు పరామర్శించారు.



మాధవరెడ్డిని పరామర్శిస్తున్న టిడిపి నేతలు




బోరు వద్ద పూజలు నిర్వహిస్తున్న సింగిల్ విండో అధ్యక్షుడు ఎన్ గణేష్. తాగునీటిని సరఫరా చేస్తున్న టిడిపి నాయకులు

# గోర్ బంజారా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**అధ్యక్షులుగా రోళ్ల బద్రినాయక్ ఎన్నిక..**

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 8 :** మడకశిర నియోజకవర్గం గోర్ బంజారా కమిటీని ఆదివారం సాయి నగర్ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. మడకశిర గోర్ బంజారా సంఘాన్ని పలువురు కుల పెద్దల సమక్షంలో ఏర్పాటు చేసుకున్నారు. బంజారా సంఘం అధ్యక్షులుగా రోళ్ల మండలం ఆవినకుంట తాండకు చెందిన బద్రి నాయక్, కార్యదర్శిగా ఉమేష్ నాయక్, ట్రెజరర్‌గా ఆనంద్ నాయక్, విజయ్ కుమార్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకం, విశ్వాసం తో కమిటీ లో చోటు కల్పించారని తెలిపారు. అప్పగించిన పదవులను బంజారాల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం సభ్యులకు పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిరికల్చర్ ఏడి.హనుమంతరాయ నాయక్, సిరికల్చర్ లక్ష్మణ నాయక్, రైల్వే కానిస్టేబుల్ రమేష్ నాయక్, కానిస్టేబుల్ చంద్రనాయక్ , కొత్తలం రామాంజి నాయక్, అడ్వకేట్ బాబు నాయక్ బంజారా సేవా సమితి నాయకులు పాల్గొన్నారు.



గోర్ బంజారా సంఘం అధ్యక్షులు బద్రినాయక్



నూతనంగా ఎన్నికైన గోర్ బంజారా సంఘం కమిటీ సభ్యులు



జాతరలో తప్పిపోయిన బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు


# జాతరలో తప్పిపోయిన బాల బాలికలు క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగింత

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
కోసిగి జాతరలో తప్పిపోయిన పలువురు బాలబాలికను గుర్తించి క్షేమంగా వారి వారి కుటుంబ సబ్యులకు అప్పగించి నట్లు ఎస్సై రమేష్ రెడ్డి ఆదివారం నాడు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హొళగుంద మండలం, నెరనికి గ్రామానికి చెందిన మోదిన్ సాహెబ్ అనే వ్యక్తి తన భార్యతో పాటు తన చెల్లెలు 14 సంవత్సరాల బాలిక పింజరి మాబ్ జాన్ ను తీసుకొని శనివారం నాడు శ్రీ కోసిగి రేణుక యల్లమ్మ జాతరకు వచ్చారు. జాతర సందర్భంగా రాత్రి సమయంలో పై బాలిక తప్పిపోయినదని. తప్పి పోయిన బాలిక ఎటు వెళ్లాలో తెలియక ఆందోళన చెందుతూ కోసిగి బస్టాండ్ పరిసరాల్లో తిరుగుతూ ఉండగా, అందిన సమాచారం మేరకు వెంటనే స్పందించి ఆబాలికను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించినట్లు ఎస్సై రమేష్ రెడ్డి తెలిపారు.అలాగే. కర్ణాటక రాష్ట్రం రాయచూరు మండలం, కొత్త దొడ్డి గ్రామానికి చెందిన పద్మ , జయరాజ్ దంపతుల కుమారుడు 6 సంవత్సరాలు వయస్సు కలిగిన అభిరామ్ తో కలిసి శ్రీ కోసిగి రేణుక యల్లమ్మ జాతరకు వచ్చారని. జాతర సందర్భంగా సాయంత్రం సదరు అభిరామ్ తప్పిపోయి గుడి సమీపంలో ఎటు వెళ్లాలో తెలియక తిరుగుతూ ఉండగా, అందిన సమాచారం మేరకు పోలీసులు స్పందించి బాలుడి గుర్తించి తల్లి అయిన పద్మ గారి ఆచూకీ కనిపెట్టి ఆమెకు అప్పగించి నట్లు రమేష్ రెడ్డి తెలిపారు.అలాగే కోసిగికి చెందిన నగేష్ అను వ్యక్తి తన భార్య మరియు కూతురు అయిన నాలుగు సంవత్సరాల వయస్సు తలిగిన అమృత తో కలిసి శ్రీ కోసిగి రేణుక యల్లమ్మ రథోత్సవం కు వచ్చారని జాతర లో సాయంత్రం సదరు అమృత తప్పిపోయి గుడి సమీపంలో ఎటు వెళ్లాలో తెలియక తిరుగుతూ ఉండగా, అందిన సమాచారం మేరకు పోలీసులు స్పందించి బాలిక ను గుర్తించి తండ్రి అయిన నగేష్ ఆచూకీని కనిపెట్టి అతనికి అప్పగించి నట్లు ఎస్సై రమేష్ రెడ్డి తెలిపారు.కాగా జాతరలో తప్పిపోయిన తమ పిల్లలను గుర్తించి క్షేమంగా అప్పగించడంతో పిల్లల తల్లిదండ్రులు కోసిగి పోలీసులకు ప్రత్యేకించి ఎస్సై రమేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

*తహసీల్దార్ గీతా ప్రియదర్శిని ..*

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
ఈనెల 9వ తేదీ పెద్దకడబూరులోని మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసల్ సిస్టం--పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తహసీల్దార్ గీతా ప్రియదర్శిని ఆదివారం వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన విజయవాడలో మంత్రులు, సెక్రటరీలు, హెచ్ఓడీలతో నిర్వహించే ఉన్నతస్థాయి కాన్ఫరెన్స్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి రోజంతా ఈ సమావేశం కొనసాగుతుందని వివరించారు.



ఈ నేపథ్యంలో మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, పీజీఆర్ఎస్ కార్యక్రమం కోసం ఎవరూ తహసీల్దార్ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా ఈ కాన్ఫరెన్స్‌కు మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర మండల అధికారులు తహసీల్దార్ కార్యాలయం లేదా ఎంపీడీవో కార్యాలయాల్లో ఏదో ఒకచోట హాజరు కావాలని సూచించారు. స్వర్ణ గ్రామాల పరిధిలోని సచివాలయ సిబ్బంది తమ తమ సంబంధిత సచివాలయాల్లో ఫిజికల్‌గా పాల్గొనాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా వర్చువల్ విధానంలో ఈ కాన్ఫరెన్స్‌కు హాజరుకావాలని తహసీల్దార్ గీతా ప్రియదర్శిని ఆదేశించారు.



బంగారు దుకాణం ప్రారంభోత్సవంలో పాల్గొన్న టిడిపి నాయకులు

# నూతన బంగారు దుకాణం ప్రారంభం

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
అమరాపురంలో ప్రముఖ వ్యాపారవేత్త తెలుగుదేశం సీనియర్ నాయకుడు రాఘవేంద్ర గుప్తా కుమారుడు వాదిరాజు గుప్తా ఆదివారం నూతనంగా బంగారు దుకాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు ఎన్ గణేష్, డైరెక్టర్ దాదా పీర్, డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, వలస పంచాయతీ కన్వీనర్ బి.ఎస్ నాగరాజు, మద్దనకుంట రవికుమార్, తదితరులు ప్రత్యేకంగా శ్రీ సత్యనారాయణ స్వామి శ్రీ లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు, అనంతరం నగల వ్యాపారి వాది రాజుకు శుభాకాంక్షలు తెలిపారు.
అనంతరం వేణుగోపాల గుప్తా నిర్మించిన నూతన గృహప్రవేశానికి హాజరై ప్రత్యేకంగా శ్రీ సత్యనారాయణ స్వామి శ్రీ లక్ష్మీదేవి కి పూజలు నిర్వహించి, విందు భోజనంలో పాల్గొన్నారు.



నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న టిడిపి నాయకులు

# పదో తరగతి పూర్వ విద్యార్థుల కలయిక

**ముదినేపల్లి, ఫిబ్రవరి 8:**
ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలోని పెదపాలపర్రు ఈఎస్ సీ ఎం జెడ్ పి హెచ్ పాఠశాల 1987 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల స్నేహ సమావేశం ఆదివారం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది. సుమారు నాలుగు దశాబ్దాల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలిసిన పూర్వ విద్యార్థులు తమ బాల్య జ్ఞాపకాలను, పాఠశాల రోజులను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. అప్పటి గురువుల బోధనలు, స్నేహ బంధాలు, బడి ప్రాంగణంలో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుని పరస్పరం అనుభవాలను పంచుకున్నారు.

# జ్యోతి అనాథ ఆశ్రమానికి అండగా నిలుస్తాం

**బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ బాబురావు ..**

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
మంత్రాలయం మండలం తుంగభద్ర గ్రామ శివారుల్లోని జ్యోతి అనాథ ఆశ్రమానికి అన్ని విధాలా సహకారం అందిస్తామని ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పెద్దకడబూరు మండలం గంగులపాడు గ్రామానికి చెందిన బాబురావు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆదివారం జ్యోతి అనాథ ఆశ్రమాన్ని బాబురావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో నివసిస్తున్న అనాథ పిల్లలతో స్నేహపూర్వకంగా మమేకమై వారి విద్యాభ్యాసం, వసతి, భోజన సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులకు రూ.5,102 నగదు విరాళాన్ని బాబురావు అందజేశారు. సమాజంలో ఉన్న ఆర్థికంగా స్థిరమైన వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి అనాథ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సేవా భావంతో చేసే చిన్న సహాయమే పిల్లల జీవితాలను మారుస్తుందని



జ్యోతి అనాథ ఆశ్రమంలో నగదు అందజేస్తున్న బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ బాబురావు

ఆయన పేర్కొన్నారు. జ్యోతి అనాథ ఆశ్రమం నిర్వాహకులు బాబురావుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ ఇలాంటి సహకారం కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హనుమేశప్ప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# 12న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

**సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ..**

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మంత్రాలయంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సీపీఐ నియోజవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, సుదర్శన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజ్యాంగ వ్యవస్థలను, లౌకిక విలువలను నిర్వీర్యం చేస్తూ రైతు--కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు.
రైతులకు నష్టం కలిగించే వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించినా, పరోక్షంగా నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానం పేరిట రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రాకుండా చేస్తున్నారని




సమావేశానికి హాజరైన సీపీఐ నాయకులు




మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

తెలిపారు. ప్రస్తుతం నాలుగు లేబర్ కోడ్ల అమలుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, దీని వల్ల కార్మిక వర్గం మరింత సంక్షోభంలో నెట్టబడుతుందని అన్నారు. దేశంలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉందని, 80 శాతం రైతులు, వ్యవసాయ కూలీలు నష్టాలతో జీవనం సాగిస్తుంటే, కేవలం నాలుగు శాతం కార్పొరేట్ సంస్థలకే ప్రభుత్వం మద్దతు ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అమెరికాతో కుదుర్చుకుంటున్న మధ్యంతర వాణిజ్య ఒప్పందాలు భారత వ్యవసాయం, రైతులను తీవ్రంగా నష్టపరిచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి, కొత్త పథకాలను ప్రవేశపెట్టడం వల్ల ఉపాధి అవకాశాలు తగ్గి, పెద్ద ఎత్తున వలసలు పెరుగుతున్నాయని తెలిపారు. కావున బీజేపీ కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే విధంగా ఫిబ్రవరి 12న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు, మండలాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మిగనూరు పట్టణ కార్యదర్శి రంగన్న, పెద్దకడబూరు మండల కార్యదర్శి వీరేష్, పెద్దకడబూరు సహాయ కార్యదర్శులు చంద్ర, తిక్కన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి టీ. థామస్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎం. రాజు, చిన్నకడబూరు గిడ్డయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# వేదావతి నదిపై రూ.6 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ

**కనేకల్లు-మాల్యం గ్రామాల మధ్య రాకపోకలకు నూతన వారధి ..**
**ఏళ్లనాటి రహదారి సమస్య పరిష్కారానికి కూటమి హయాంలో పరిష్కారం..**
**ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు..**

కనేకల్లు, (తెలుగోడు)ఫిబ్రవరి 08 :
కనేకల్లు నుండి మాల్యం, సొల్లాపురం హనుమాపురం మీదుగా ఉరవకొండ కు వేదావతి హగరీ ప్రాంతం నుండి వెళ్లే రహదారికి రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు ఆదివారం రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బ్రిడ్జి పనులకు భూమి పూజ నిర్వహించి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో రెండు గ్రామాల మధ్య ఎన్నో సంవత్సరాల నుండి నిర్మించాలనుకున్న బ్రిడ్జి కు భూమి పూజ నిర్వహించడంతో ప్రయాణికులు ప్రజలు ఊపిరి పిలుచుకున్నారు. రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు స్థానిక ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ, బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే రైతులు తమ పంటలను మార్కెట్లకు సులభంగా తరలించుకోగలరని, ప్రయాణం సైతం అనుకూలంగా ఉంటుందని తెలిపారు. గతంలో ఈ ప్రాంతం ద్వారా ఇచ్చే ప్రయాణికులు ముఖ్యంగా వర్షాకాలంలో అనేక వెయ్య ప్రయాసలకు గురి అయ్యి నరకయాతన అనుభవించారని ఆ సమస్యలను గుర్తించిన కూటమి ప్రభుత్వం ప్రజల ప్రయాణికుల నరకయాతనను తప్పించేందుకు పూట మీ ప్రభుత్వం చరువచూపి శాశ్వత పరిష్కారానికి బ్రిడ్జి రూపంతో దారి వేస్తుందన్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు నానా ఇబ్బందులు ఎదుర్కొని ఈ



బ్రిడ్జ్ నిర్మాణానికి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు



బ్రిడ్జ్ పనుల నిర్మాణ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు

సమస్య ఎప్పటికీ పరిష్కారం కాదని పలుమార్లు భావోద్వేగానికి సైతం లోనయ్యారని తమ ప్రాణాలు సైతం గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణం చేశారన్నారు. విద్యార్థులు విద్యాసంస్థలు పరీక్షల సమయంలో సమయానికి వెళ్లకపోవడంతో ఎదురయ్యే ఇబ్బందులు వర్ణనాతీతమన్నారు. రోజువారీ కూలీలు, ఉద్యోగులు తమ పనుల కోసం త్వరితగతిన వేగంగా ప్రయాణించగలరని పేర్కొన్నారు. అత్యవసర సేవలు అయినా ఆరోగ్య సమస్యలు కూడా త్వరగా అందుబాటులోకి వస్తాయని ఆయన అన్నారు.ముఖ్యంగా వర్షాకాలంలో వేదావతి నది ఉప్పొంగే సమయంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు. జిల్లాకు సైతం రాకపోకలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చి సమయపాలన కలిసి వస్తుంది అన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి పరిష్కారం కానీ ఈ సమస్య తన చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం గర్వంగా ఉందన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో ప్రజలకు అవసరమైన మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజాసేవ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాయదుర్గం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి కొనసాగిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బ్రహ్మయ్య ఎంపీడీవో విజయసింహారెడ్డి,పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు లాలెప్ప, మండల టిడిపి కన్వీనర్ వన్నా రెడ్డి, ఉప్పర సంఘం డైరెక్టర్ ఆనంద్ రాజ్, ఆదర్శ బ్యాంక్ అధ్యక్షుడు చంద్ర శేఖర్ గుప్తా, పెరుగు సంఘం అధ్యక్షుడు బిటి రమేష్, మార్కెట్ యాడ్, గోపులాపురం బసవరాజు, పర్యవేక్షకుడు చాంద్ బాషా, ఆది,శరభన్న గౌడ్,జయరామ్ చౌదరి,అశోక్ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

**పెందుర్తి, ఫిబ్రవరి 8:**
సుజాత నగర్ శ్రీ సత్య సాయి భక్త బృందం అందిస్తున్న సేవలు అజరామరామరమని కార్పొరేటర్లు సేనాపతి వసంత శంకర్రావు.. మమ్మన దేవుడు.. సత్య సాయి ఆనంద నిలయం గౌరవ అధ్యక్షులు.. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు లు కొనియాడారు.. ఆదివారం సుజాతనగర్ లోని ఆనంద సాయి మందిరంలో సత్య సాయి భక్త బృందం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీరంతా మాట్లాడుతూ ఏడాది పొడవునా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.. నిరుపేదలకు దుప్పట్లు.. రగ్గులు.. కుట్టు మిషన్లు.. అన్నదానంతో పాటు పలు వృద్ధాశ్రమాలకు నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించి ఎంతోమందిని ఆదుకుంటున్న ఘనత వీరికే దక్కుతుందన్నారు. సత్య సాయి పుట్టినరోజు వేడుకలు సందర్భంగా నిరంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ ప్రాంత ప్రజలందరికీ ఆధ్యాత్మిక భక్తి భావం పెరిగే విధంగా కూడా సత్యసాయి భక్త బృందం ఎంతో కృషి చేస్తుందన్నారు..ప్రతి ఏటా మూడు పర్యాయాలు రక్తదాన శిబిరాలు నిర్వహించి ఎంతోమందికి ప్రాణదాతలుగా నిలుస్తున్నారని అన్నారు.



ఐఏఎస్ అధికారి గురుమూర్తిని సన్మానించిన టీడీపీ నాయకులు

# ఐఏఎస్ అధికారి గురుమూర్తికి సన్మానం

**టీడీపీ నాయకులు..**

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
మండల కేంద్రమైన కోసిగి కి చెందిన ఐఏఎస్ అధికారి గురుమూర్తి ని కోసిగి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లెపాడు .రామిరెడ్డి తదితరులు ఆదివారం నాడు కోసిగిలోని ఆయన స్వ గృహంలో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానం చేయడం జరిగింది .ఈ .సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అక్షరాస్యత లో ఎంతో వెనుక బడిన మండలమైన కోసిగి ప్రాంతంలో పుట్టి ఐ ఏ ఎస్ చదివి దేశ స్థాయిలో ఎన్నో పదవులు చేపట్టి దేశ ప్రజలకు సేవలందించిన అధికారి గురుమూర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తౌవి రామకృష్ణ,మంత్రాలయం మాజీ జడ్పీటీసీ మాలపల్లి లక్ష్మయ్య, అరివిల్లి వీరేశ్, చింతకుంట హనుమంతు ,గ్యాలెం వీరేష్ ఉప్పలపాటి అర్జున్ పాల్గొన్నారు



ఎద్దుల బండి గిరక పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

# ఆకట్టుకున్న బండిఎద్దుల గిరిక పోటీలు

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
కోసిగిలో జరిగిన రేణుకా ఎల్లమ్మ జాతర కరి పండుగ పురస్కరించుకుని మంగళవారం నాడు కోసిగిలోని బూగెని చెరువులో ఎద్దుల బండి గిరక పోటీలు నిర్వహించారు. ఇందులో రైతులు తమ ఎద్దులతో పాల్గొని గిరక పోటీలలో తమ సత్తా చాటారు. ఈ పోటీలను తిలకించడానికి పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన వారికి కూటమి నాయకులు బహుమతులు అందజేశారు.

# ఆర్ డి టి ఉద్యమాన్ని అణచివేసిన టిడిపి నాయకులు

*ఫెర్రర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ..*

**అనంతపురం రూరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
కడుపు కాలిన పేదవానికి కాసింత బువ్వ పెడుతున్న ఆర్డిటికి ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ చేయించే బాధ్యత మాదని,చంద్రబాబు, లోకేష్ బాబు మొదలుకొని, తెలుగుదేశం పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎంపీలు మాట ఇచ్చి,ఉద్ధృతంగా నడుస్తున్న ఉద్యమంపై నీళ్లు చల్లారని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ రమణ ఆరోపించారు. ఈ మేరకు నగరంలోని ఆర్డిటి వ్యవస్థాపకులు స్వర్గీయ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పోరాటానికి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. టిడిపికి చిత్తశుద్ధి ఉంటే ఇది గంటలోపు పరిష్కారమే సమస్య అన్నారు. అయినా కాలేదంటే వీరి పని,ప్రయత్నాలు నాటకీయంగా,తూతూ మంత్రంగా సాగుతున్నాయని అర్థమవుతుంది.ఎందుకంటే మా దగ్గర డబ్బు ఉంది విద్య కైనా, వైద్యానికైనా ఎంతైనా ఖర్చు పెట్టుకోగలం, అత్యంత ఖరీదైన వీటిని ఉచితంగా అందిస్తున్న ఆర్డిటి లాంటి సంస్థలు ఉంటే కార్పొరేట్ ఆసుపత్రులు,ర్పొరేట్ విద్యాలయాలు మూతపడతాయని, పేదలు తమ మాటలు వినరు అన్న స్వార్థపూరిత,పెత్తందారీ ఆలోచనలేనని అర్థమవుతోందన్నారు. అనంతపురం జిల్లాలో ఉద్యమం ఉధృతంగా నడుస్తున్న సమయంలో, జిల్లా స్థానిక ప్రజా ప్రతినిధులు ఎఫ్‌సిఆర్ఏ రెన్యువల్ చేయించే బాధ్యత తమదని, నెరవేర్చే వరకు నిద్రపోమని ఉత్తర ప్రగల్భాలు పలికి, పత్రికలలో ఫోటోలకు ఫోజులు ఇచ్చి,రగులుతున్న ఉద్యమాన్ని చల్లార్చారని ఆరోపించారు. నేడు కాలు కాలిన పిల్లుల్లాగా,నక్కినక్కి తిరుగుతున్నారని, ఇది సిగ్గుగా అనిపించలేదా అన్నారు. అనంతపురం పేద ప్రజలు మరొక్కసారి ఐక్యమై,కూటమి ప్రభుత్వం బూటకపు మాటలను ప్రజలలో ప్రచారం చేసి ఆర్డిటికి ఎఫ్ సి ఆర్ ఏ పునరుద్ధరణ జరిగే వరకు రాజకీయ,కుల,మతాలకు అతీతంగా అన్ని పార్టీలను,ప్రజాసంఘాలను, బహుజన సంఘాలను ఒక వేదిక మీదికి తీసుకు వచ్చి అన్ని త్యాగాలకు సిద్ధమై ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.





లారీని సీజ్ చేసిన పోలీసులు

## తూనికల్లో తేడాలు

**రైతుల ఫిర్యాదు. లారీ సీజ్..**

**ముద్దనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
అన్నం పెట్టే రైతులను మోసం చేస్తూ తూనికల్లో అవకతవకలు ఉన్నాయని గుర్తించిన రైతులు, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో లారీని పట్టుకున్నారు. తాడిపత్రికి చెందిన ఓశెనగల వ్యాపారి తూనికలో మోసం చేసినట్లు అంగీకరించి రైతులకు కొంత మొత్తం చెల్లించినట్లు తెలిసింది. అయితే పోలీసులు నుండి ఎలాంటి సమాచారం లేదు.

## జనసేనలో పలువురి చేరిక

**ఇంచార్జ్ భైరవ ప్రసాద్..**

**కదిరి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
లిఈరోజు కదిరి నియోజక వర్గంలో జనసేన పార్టీ కార్యాలయంలో సురేష్ ఆధ్వర్యంలో ఇంచార్జ్ భైరవ ప్రసాద్ సమక్షంలో కుమ్మర వాండ్లపల్లి , కదిరి పట్టణ పరిధిలో పలువురు యువకులు అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు , సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా భైరవ ప్రసాద్ మాట్లాడుతూ " అతి సామాన్యులను సైతం రాజకీయాల్లో ప్రోత్సహించాలని యువతకు , మహిళలకు , పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పెద్దపీట వేస్తూ జనసేన పార్టీని 2014లో స్థాపించారన్నారు. ఆనాటి నుంచి నేటి వరకూ పవన్ కళ్యాణ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం , ప్రజా సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషిని భారత ప్రధాని నరేంద్ర మోడీ సైతం అభినందించారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను , అభివృద్ధిని ప్రజల్లోకి మరింత చేరువ చెయ్యడానికి కృషి చెయ్యాలని భవిష్యత్తులో పార్టీ బలోపేతం కోసం కృషి చేసే ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారిలో సురేష్, బాబాసాబ్ ,నాగార్జున, మహమ్మద్ రఫీక్, షాజహాన్ ,శివకుమార్ ,లోకేష్ ,ఉమర్ ఫరూక్,రామాంజనేయులు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చలపతి, లక్ష్మణ్, రవికుమార్, చిన్నపరెడ్డి అంజిబాబు రాజేంద్రప్రసాద్ రవీంద్ర గంగరాజు, అంజి, రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు 'ఫార్మర్ రిజిస్ట్రీ ఐడి' తప్పనిసరిగా తీసుకోవాలి

**మండల వ్యవసాయ అధికారి అమర్నాథరెడ్డి..**

**దువ్వూరు (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలంటే రైతులందరూ తప్పనిసరిగా 'ఫార్మర్ రిజిస్ట్రీ ఐడి' నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అమర్నాథరెడ్డి తెలిపారు. ముఖ్యంగా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా వంటి పథకాలతో పాటు ఇతర వ్యవసాయ అనుబంధ రాయితీలు పొందడానికి ఈ ఐడి కార్డు ప్రామాణికంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఐడి లేని పక్షంలో భవిష్యత్తులో ప్రభుత్వ లబ్ధి అందే అవకాశం ఉండదని స్పష్టం చేశారు.రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రం కు వెళ్లి అక్కడ ఉన్న వ్యవసాయ సహాయకుల వద్ద తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. లేదా సొంతంగా మొబైల్ ద్వారా కూడా ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చన్నారు. ?మండలంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ముఖ్యంగా ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానమై ఉన్న వారు వెంటనే తమ నమోదును పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. ఏవైనా సందేహాలు ఉంటే స్థానిక వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.




# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**దువ్వూరు (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
కడప కర్నూలు జాతీయ రహదారిపై ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ బాబు అక్కడికక్కడే మృతి చెందినట్లు దువ్వూరు పోలీసులు తెలిపారు. వివరాల్లోకెళితే ఆదివారం తెల్లవారుజామున ప్రొద్దుటూరు మండలం చెన్నమరాజు పల్లె గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మరియు ఓనర్ అయిన వరికూటి బాబు ప్రొద్దుటూరు నుండి ట్రాక్టర్ లో ఇటుకలను లోడు చేసుకుని ఆళ్లగడ్డ వైపు వెళుతుండగా కడప కర్నూలు జాతీయ రహదారిపై దువ్వూరు మండలం కానగూడురు సమీపంలోని బయనపల్లె మెట్ట వద్ద ఇటుకల ట్రాక్టర్ ను వెనుక వైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లింది, ఈ ప్రమాదం లో ట్రాక్టర్, ట్రాలీ జాతీయ రహదారిపై బోల్తాపడ్డాయి, వాహనాన్ని నడుపుతున్న బాబు (42) పై ఇటుకల ట్రాలీ పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు, ప్రమాధ ఘటనపై స్థానికులు సమాచారం అందివ్వడంతో వెంటనే సంఘటన స్థలానికి చెరుకున్న పోలీసులు ప్రోక్లైన్ ద్వారా ట్రాక్టర్ ను పక్కకు తోలగించి, మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు, ఈమెరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దువ్వూరు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన బాబు




రోడ్డుకు అడ్డంగా పడిన ట్రాక్టర్



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

## దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేద్దాం

***12న చలో తాడిపత్రి కర్లపత్రాలు విడుదల..***
***సిఐటియు నాయకులు..***

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు యాడికి మండల కేంద్రంలోని శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణంలో ఆదివారం సిఐటియు నాయకులు ఉమా గౌడ్, హనుమంత్ రెడ్డి. మహాలక్ష్మి, మాయకుంట మోహన్, బషీర్ అహ్మద్, రాఘవ, రసూల్. శ్రీనివాసులు. పెద్దన్న 12న చలో తాడిపత్రి కరపత్రాలు విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ దేశవ్యాప్తంగా అమల్లోకి రావడంతో 29 కార్మిక చట్టాలు రద్దయ్యాయి అన్నారు. కేరళ రాష్ట్రం ఒక్కటే లేబర్ కోడ్ల అమలుకు నిరాకరించింది అన్నారు. బీహార్ ఎన్నికల్లో నెగ్గిన వారానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్ల అమల్లోకి తెచ్చిందన్నారు. విద్యుత్తు సవరణ బిల్లును, విత్తనాల సవరణ బిల్లును బడ్జెట్ సమావేశాల్లో ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలి. లేబర్కోడ్కు వ్యతిరేకంగా పోరాడాలని అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, సంయుక్త కిసాన్ మోర్చా (520 సంఘాలు) 2026, ఫిబ్రవరి 12న సమ్మెకు పిలుపునిచ్చాయి అన్నారు. కార్పొరేట్ల ఒత్తిడితోనే పాలకవర్గం లేబర్ కోడ్ను అమల్లోకి తెచ్చిందన్నారు. కార్మిక వర్గాన్ని మరింతగా దోచుకోవడానికి ఇప్పుడున్న కార్మిక చట్టాలు అడ్డుగా ఉన్నాయనేది వారి విధానం అన్నారు. కార్మికవర్గానికి ఇప్పుడున్న హక్కులను కూడా తొలగించడమే లేబర్ కోడ్స్ సారాంశం దఅన్నారు. ఇప్పటివరకూ కార్మిక చట్టాల్లో ఉన్న సారాన్ని పిండి వదిలిన పిప్పే లేబర్ కోడ్‌లు అన్నారు.

ఇప్పటివరకూ వేతనాలు పెంచుకునే వ్యవస్థ త్రైపాక్షిక్ష విధానం లేబర్ కోడ్‌లో రద్దయిందా లేదా, లేబర్ కోడ్స్లో ఒకే దేశం ఒకే వేతనం పేరుతో జాతీయ కనీస వేతనం రోజుకు రూ. 178 ప్రకారం వేతనాలు పెరగకపోగా తగ్గుతాయి. దేశంలోనే వేతనం కనీసంగా ఉన్న రాష్ట్రాన్ని కొలబద్దగా తీసుకున్నారు అన్నారు. పని గంటలు 8 నుంచి 12కు మార్చారని, ఓవర్ టైమ్కు అదనపు జీతం చెల్లించకుండా చేశారన్నారు. ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ చేయాలంటే కనీసం ఏడుగురు కార్మికులుంటే చాలు అని, లేబర్ కోడ్స్ ప్రకారం కనీసం 100 మంది లేదా 10 శాతం మంది కార్మికులు ఉండాలని మార్చారా లేదా అని నిలదీశారు. పరిశ్రమల లేఆఫ్, లాకౌట్, మూసివేతలకు వంద మంది కార్మికులు ఉన్నా ప్రభుత్వ అనుమతులుండాలని, లేబర్ కోడ్ ప్రకారం 300 మందిలోపు పరిశ్రమలకు అనుమతులు అక్కరలేదున్నారు. అంటే 85 శాతం పరిశ్రమల్లో యజమానులు ఇష్టా రాజ్యాంగ కంపెనీలు మూసివేయచ్చు అన్నారు. ఇప్పటి వరకూ ఈఎస్ఐ వర్తించాలంటే 10 మంది ఒక యజమాని క్రింది పనిచేస్తుండాలని, దానిని 20 మందికి మార్చారన్నారు. ఒక కాంట్రాక్టరు క్రింద ఇప్పటి వరకూ 20 మంది కార్మికుల పని చేస్తే ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, కనీస వేతనాలతో సహా అన్ని హక్కులు వర్తిస్తాయాని, దానిని ఇప్పుడు 50 మందికి మార్చారన్నారు. భవిష్యత్తులో కాంట్రాక్ట్ కార్మికులకు ఏ చట్టాలు తదితర వాటిపై ఈ నెల 12న సిఐటియు ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన కార్యక్రమానికి కార్మికులు అందరూ హాజరై జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఉమా గౌడ్ హనుమంత్ రెడ్డి. మహాలక్ష్మి. మాయ కుంట మోహన్. బషీర్ అహ్మద్. రాఘవ. రసూల్. శ్రీనివాసులు. పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



క్యూలైన్లకు అతి సమీపంలో భక్తుల సౌకర్యార్థం తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న షెడ్లు



పాత తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విద్యుత్, అంగన్వాడి కార్యాలయాలు

**శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు మొదలైనా**

# కొనసాగుతున్న పనులు..




**శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
శ్రీశైల మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్న ప్రకటనలు మాటలకే పరిమితమయ్యాయి. భక్తుల రద్దీ పెరుగుతున్నా పనులు ఇంకా కొనసాగుతూ ఉన్నాయి. భక్తుల సౌకర్యార్థం తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న క్యూలైన్ల షెడ్లు ,శివ స్వాములు, శివ భక్తులు సేద తీరేందుకు ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక షెడ్లు, పార్కింగ్ ప్రదేశాల్లో భక్తుల సౌకర్యం తాగునీరు సౌకర్యాల పనులు కొనసాగుతూనే ఉన్నాయి. కాలినడకన వచ్చే భక్తులకు ఏర్పాట్లు అరకొరగానే ఉన్నాయి. పార్కింగ్ ప్రదేశాల్లో ప్రతి సంవత్సరం ఏర్పాటు చేస్తే మరుగుదొడ్లకు తాత్కాలిక టాయిలెట్లకు నీటి కనెక్షన్ ఇంకా ఇవ్వకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు



ఎదుర్కొంటున్నారు. అధికారులు మాటలు కోటలు దాటినా పనులు మాత్రం గడప దాటడం లేదు అనే చెప్పాలి. ఇప్పటికైనా అధికారులు త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు. శివరాత్రికి శ్రీశైలం వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని భక్తులు శివ స్వాములు కోరుకుంటున్నారు.




పార్కింగ్ ప్రదేశాలు



## విద్యుత్, ఐసిడిఎస్ శాఖల కార్యాలయాలు ప్రారంభం

**టీడీపీ జిల్లా నాయకులు పెద్ద తిప్పయ్య, మల్లికార్జున..**

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 8 :**
ఎన్నో ఏళ్లుగా విద్యుత్, ఐసిడిఎస్ శాఖల అధికారులకు ప్రభుత్వ సొంత భవనాలు లేక, ప్రైవేటు భవనాలలో అద్దెలు చెల్లించలేక ఆయా శాఖల అధికారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే స్థానిక టీడీపీ నాయకులతో విద్యుత్,ఐసిడిఎస్ శాఖల అధికారులు సమస్యను వివరించడంతో పాత తహసిల్దార్ కార్యాలయం ఖాళీగా ఉన్న విషయాన్ని స్థానిక టిడిపి నాయకులు మల్లికార్జున, పెద్ద తిప్పయ్య లు మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకుని వెళ్లారు. ఈ రెండు కార్యాలయాలకు పాత తహసీల్దార్ కార్యాలయానికి మార్పు చేయాలని సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఆదివారం విద్యుత్, ఐసిడిఎస్ శాఖల అధికారులు పాత తహసిల్దార్ కార్యాలయంలో వేరువేరుగా గదులలో ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఆయా శాఖల అధికారులు సమస్యను మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించిన టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున పెద్ద తిప్పయ్య లను పూజలకు ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది రుద్రమణి, యల్లారెడ్డి, శంకర్, ఆషావలి, ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, అంగన్వాడి వర్కర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు



టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున పెద్దతిప్పయ్యను సన్మానిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది



రింగ్ రోడ్ లో ఇంకా చదును చేస్తున్న పార్కింగ్ ప్రదేశాలు



టీడీపీ జిల్లా నాయకులు పెద్ద తిప్పయ్య మల్లికార్జునను సన్మానిస్తున్న ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, అంగన్వాడి సిబ్బంది

## బర్డ్‌ఫ్లూపై ప్రజలకు ముఖ్యసూచనలు

మదనపల్లె (తెలుగోడు), ఫిబ్రవరి 8 :
బర్డ్‌ఫ్లూ (ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా) అనేది ప్రధానంగా పక్షులను ప్రభావితం చేసే వ్యాధి. ఇది మనుషులకు వ్యాపించే అవకాశాలు చాలా అరుదు. బర్డ్‌ఫ్లూ ఎక్కువగా సోకిన పక్షులు లేదా వాటి విసర్జనలను తాకడం వల్ల వ్యాప్తి చెందుతుంది. పరిశుభ్రత పాటించడం, పౌల్ట్రీని సురక్షితంగా నిర్వహించడం ద్వారా ప్రమాదాన్ని పూర్తిగా నివారించవచ్చు. 100 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతతో వండిన కోడిమాంసం, గుడ్లు తినడం పూర్తిగా సురక్షితం. "బర్డ్‌ఫ్లూ" నివారణకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. బర్డ్‌ఫ్లూ సమాచారం వెంటనే పశుసంవర్ధక శాఖకు చేరవేయాలి. బర్డ్ ఫ్లూ సోకిన కోళ్ల ఖననం కోసం 8 రాపిడ్ రెస్పాన్స్ బృందాల ఏర్పాటు చేశారు. బర్డ్ ఫ్లూ సమాచారం మరియు అనుమానాల నివృత్తి కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు (7013914401, 9398262752) చేశారు.

**ఆహార భద్రత సూచనలు..**
100 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతతో ఉడికించిన చికెన్, గుడ్లు తినడం సురక్షితం. మాంసం, గుడ్లు కనీసం 100 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతతో ఉడికేలా వండాలి. సగం వండిన మాంసం, గుడ్లు తినవద్దు

**నివారణ చర్యలు..**
అనారోగ్యంగా ఉన్న లేదా మృతిచెందిన పక్షులను తాకవద్దు. ఎక్కడైనా పక్షుల అకస్మాత్తు మరణాలు గమనిస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలి. పౌల్ట్రీ పెంపక ప్రాంతాల్లో పరిశుభ్రతను పాటించాలి. పక్షులను తాకిన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడగాలి. తప్పనిసరి పరిస్థితుల్లో పక్షులను నిర్వహించేటప్పుడు రక్షణ చర్యలు తీసుకోవాలి.

**చికిత్స, ఆరోగ్య సూచనలు..**
జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలి. స్వయంగా మందులు వాడకూడదు. వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి.

**ప్రజలకు ముఖ్యమైన సూచనలు :**
వదంతులు, అసత్య సమాచారం సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దు. జిల్లా యంత్రాంగం జారీ చేసే అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలి. పర్యవేక్షణ, తనిఖీలు, అవగాహన కార్యక్రమాల్లో అధికారులకు సహకరించాలి. బర్డ్ ఫ్లూ సోకిన కోళ్ల ఫారాల దగ్గర వెళ్ళరాదు. బర్డ్ ఫ్లూ పై సమాచారం అందించేందుకు పైన తెలిపిన కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేసి వివరాలు తెలపవచ్చు. పౌల్ట్రీ రైతులు పశుసంవర్ధక శాఖ సూచించిన బయో-సెక్యూరిటీ చర్యలు తప్పనిసరిగా పాటించాలి. బర్డ్ ఫ్లూ కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లిస్తుంది.



చెన్నైలో జరిగిన వైయస్ సునీల్ రెడ్డి కుమారుడు సాహిల్ వివాహం సందర్భంగా వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ దంపతులు



# బర్డ్‌ఫ్లూపై ఆందోళన వద్దు

### నష్టపోయిన రైతులకు నష్టపరిహారం.. బర్డ్‌ఫ్లూపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు.. జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్.. కోళ్ల నుండి మనుషులకు బర్డ్ ఫ్లూ సోకదు.. 100 డిగ్రీలకు పైగా వేడిచేసిన మాంసంలో బర్డ్‌ఫ్లూ వైరస్ ఉండదు.. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్..



కోళ్లఫారంను పరిశీలిస్తున్న అధికారులు

మదనపల్లె (తెలుగోడు), ఫిబ్రవరి 8 :
బర్డ్‌ఫ్లూపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బర్డ్‌ఫ్లూ వలన నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని అన్నమయ్య మదనపల్లె జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ స్పష్టం చేశారు. అదేవిధంగా బర్డ్‌ఫ్లూపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. కోళ్ల నుండి మనుషులకు బర్డ్ ఫ్లూ సోకడం వందశాతం శూన్యం అని, 100 డిగ్రీలకు పైగా వేడిచేసిన మాంసంలో బర్డ్‌ఫ్లూ వైరస్ ఉండదని అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పేర్కొన్నారు. సదుం మండలం పుత్తవారిపల్లె, అమ్మగారిపల్లె గ్రామాలలోని రెండు కోళ్లఫారాలలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకిన నేపథ్యంలో కోళ్లను ఖననం చేయడానికి జిల్లా కలెక్టర్ పశుసంవర్ధక శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సదుం మండలంలో గుర్తించిన బర్డ్‌ఫ్లూపై చర్యలు తీసుకునేందుకు పశుసంవర్ధక శాఖకు తగిన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల సమన్వయంతో.. సదుం మండలం నుండి ఇతర ప్రాంతాలకు కోళ్ల సరఫరా జరగకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రజలు ఎవ్వరూ బర్డ్‌ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. బర్డ్‌ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సదుం మండలం మినహా మిగతా ఏ మండలాలలో అసాధారణ కోళ్ళ మరణాలు సంభవించలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లా సదుం మండలం పుత్తవారిపల్లె, అమ్మగారిపల్లె, కంభంవారిపల్లె గ్రామాలకు చెందిన ముగ్గురు రైతుల కోళ్ల ఫారాలలో అనూహ్యమైన సంఖ్యలో కోళ్ల మరణాలు సంభవించాయి. అప్రమత్తమైన పశుసంవర్ధక శాఖ మొదటి రెండు కోళ్ల ఫారాల నుండి చనిపోయిన కోళ్ల శాంపుల్స్‌ను మధ్యప్రదేశ్ భోపాల్‌లోని హై సెక్యూరిటీ ల్యాబ్‌కు పంపగా చనిపోయిన కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్లుగా నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో.. పుత్తవారిపల్లె, అమ్మగారిపల్లె గ్రామాలలోని రెండు కోళ్ల ఫారాలలోని కోళ్లను స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ద్వారా బ్లీచింగ్ పౌడర్ సున్నాలను ఉపయోగించి కోళ్లను ఖననం చేసినట్లుగా పేర్కొన్నారు. కంభంవారిపల్లె గ్రామంలోని కోళ్ల ఫారానికి చెందిన కోళ్ల శాంపిల్స్ యొక్క నివేదిక భోపాల్ నుండి రావాల్సి ఉందని నివేదిక వచ్చిన వెంటనే దానిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బర్డ్‌ఫ్లూపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఆటోల ద్వారా ప్రసారం చేస్తున్నామని పేర్కొన్నారు. కోళ్ల నుండి మనుషులకు బర్డ్‌ఫ్లూ సోకే అవకాశాలు చాలా తక్కువని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నూరు డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతతో వేడిచేసిన చికెన్‌ను తినడం వల్ల ఎటువంటి సమస్య ఉండదని ప్రజలు ఈ విషయంలో భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అమ్మగారిపల్లె పుత్తవారిపల్లె గ్రామాలలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, ప్రజలు ఎవరైనా కోళ్లలో అసాధారణ మరణాలు సంభవించడం గమనిస్తే వెంటనే 7013914401 (అమ్మవారిపల్లి), 9398262752 (పుత్తవారిపల్లె) నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలపవచ్చని పేర్కొన్నారు.

# మదనపల్లెలో సంస్థాగతంగా వైసీపీ బలోపేతం

### క్షేత్రస్థాయి నుంచి పార్టీ పటిష్టతకు శ్రీకారం.. పార్టీ పరిశీలకులు మనుజారెడ్డి.. మండల పరిశీలకులు హర్షవర్ధన్‌రెడ్డి..

మదనపల్లె (తెలుగోడు), ఫిబ్రవరి 8 :
మదనపల్లి రూరల్ మండలంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు పడ్డాయి. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు రాబోయే రాజకీయ సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడమే లక్ష్యంగా మండలంలోని పెంచుపాడు, మాలేపాడు పంచాయతీల గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి నూతన గ్రామకమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు మనుజారెడ్డి, మదనపల్లె నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులుమదనపల్లి రూరల్ మండల పరిశీలకులు హర్షవర్ధన్ రెడ్డి, రూరల్ మండల కన్వీనర్ దండు కృష్ణారెడ్డి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పెంచుపాడు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా రెడ్డిపల్లి సుదర్శన్ రెడ్డి, అలాగే మాలేపాడు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా పి.నరసింహులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి వరకు పార్టీని వ్యవస్థాపకంగా, పారదర్శకంగా తీర్చిదిద్దడమే ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశమని నేతలు స్పష్టం చేశారు. పునాదులు గట్టిగా ఉన్నప్పుడే పార్టీ బలంగా ఉంటుందని, అందుకే గ్రామ స్థాయిలో కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించి వారికి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో జరగనున్న స్థానికసంస్థల ఎన్నికలలో గ్రామస్థాయిలో వైసీపీ విజయకేతనం ఎగురవేసి, రాబోయే 2029 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, అందుకు అనుగుణంగా 'జగన్ 2.0'లో కార్యకర్తలకే అత్యంత ప్రాధాన్యత ఉంటుందని నేతలు వివరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను గమనించాలని, గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ చేరిన సంక్షేమ పథకాలను ప్రజలకు మరోసారి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో పెంచుపాడు సర్పంచ్ సాలమ్మ, మాఏపాడు సర్పంచ్ గణేష్, ఎంపిటిసిలు సుబ్బలక్ష్మి, ఈశ్వరమ్మ, దండు కృష్ణారెడ్డి, బియ్యపు రెడ్డి, మనోహర్, ఈశ్వర, నరసింహారెడ్డి, ప్రేమవతి, చంద్ర, ప్రసాద్, నరసింహులు, చలపతి, సాంబ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మత్స్యకార సంఘంలో ఉన్నవారికి బెస్త సంఘంలో చోటు లేదు

అనంతపురం రూరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 8 :
మత్స్యకార సంఘం అంటే వృత్తి సంఘం.ఈ సంఘంలో చేపలు పట్టగలిగిన వారు,ఏ కులస్తులైనా ఉండవచ్చు అని, అయితే బెస్త సంఘంలో కేవలం సాంప్రదాయ మత్స్యకారులనా బెస్తలు మాత్రమే ఉంటారని బెస్త సేవా సంఘం అనంతపురం జిల్లా కమిటీ పేర్కొంది. మత్స్యకార సంఘానికి,బెస్త సంఘానికి ఉన్న ఈ తేడాను బెస్త కులస్తులందరూ అర్థం చేసుకోవాలిలని, లేకుంటే మత్స్యకార సంఘాల ఉచ్చులో పడి,బెస్తలు తమ ఉనికిని కోల్పోతారని హెచ్చరించింది. రాయలసీమలో గణనీయంగా ఉన్న బెస్తలను కోస్తా ప్రాంతంలో అగ్నికుల క్షత్రియ,తీర ప్రాంతంలో పట్టపు, దక్షిణ ప్రాంతంలో వన్నెకుల క్షత్రియ కులాలు గంగపుత్రుల ముసుగులో బెస్తలను రాజకీయంగా,దెబ్బ తీస్తున్నారని కమిటీ ఆరోపించింది. ఫలితంగా బెస్త కులానికి రాష్ట్రస్థాయి సంఘం కూడా లేకుండా పోయిందని, ఇది బెస్తల పట్ల వారికున్న చిన్నచూపుకు నిదర్శనం అని పేర్కొంది. అందుకే బెస్తలకు స్వాతంత్ర్యా నంతరం చట్టసభలలో స్థానం లేదని, స్థానిక సంస్థలలో, పార్టీ పదవులలో ప్రాతినిధ్యం నామ మాత్రమే అని పేర్కొంది. ఇలాంటి తరుణంలో రాజకీయంగా ఎదిగిన పైన కనబరిచిన గంగపుత్ర కులాలు బెస్త కులానికి కూడా రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పించాలని ఏనాడూ, ఏ సందర్భంలో కూడా ప్రయత్నం చేయలేదని, పైగా బెస్తలను కూడా గంగ పుత్రులలో కలుపుకొని,అధిక జనాభా చూపించుకొని,వారే పదవులు పొందుతున్నారని జిల్లా కమిటీ పేర్కొంది. నేటికీ పదవులు అనుభవిస్తున్నారని, అందుకే రాష్ట్రం నలుమూలలలో ఉన్న బెస్తలు గ్రామ,గ్రామాన సంఘాలు ఏర్పాటు చేసుకొని, సంఘటితమై,గంగపుత్రుల ముసుగులో బెస్తలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టి రాజకీయ చైతన్యం పొందాలని జిల్లా కమిటీ పేర్కొంది. బెస్త కులస్తులందరూ ఇతర సంఘాలలో చేరవద్దని, బెస్త సంఘంలో మాత్రమే పనిచేసి, మన ఐక్యతను,బలాన్ని చాటి, బెస్తల సంస్కృతి, సంప్రదాయాలతో పాటు మనం ఎదుర్కొంటున్న సమస్యలను బయట ప్రపంచానికి చాటుదాం అని జిల్లా కమిటీ పేర్కొంది.రాజకీయ పార్టీలపై ఒత్తిడి తీసుకొచ్చి, బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుదామని, ఆ తరువాత సామూహిక సమస్యలపై గంగపుత్ర 14 ఉప కులాలను కలుపుకుని జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పాటు చేసుకుని ముందుకు వెళదాం.అని అనంతపురం జిల్లా బెస్త సేవా సంఘం పిలుపునిస్తోంది. రోజుకొక్క సంఘం పేరుతో బ్రతుకు సంఘాలుగా మార్చుకుని అమాయకమైన, అవగాహన లేని,బెస్తలను బలి పశువులను చేస్తున్న వారిని ఎక్కడికక్కడ నిలదీయాలని హెచ్చరిస్తున్నామని జిల్లా కమిటీ పేర్కొంది.

## నేడు సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం

అమరావతి, ఫిబ్రవరి 08:
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం మంత్రులు, కార్యదర్శుల సమావేశం జరగనుంది. సచివాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకూ ఈ సమీక్ష నిర్వహించనున్నారు. మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. అలాగే జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్ గా ఈ సమావేశంలో పాల్గొననున్నారు. జీఎస్డీపీ వృద్ధిరేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల్లో భాగంగా పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖలు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ పై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు.

# శ్రీశైలంలో ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

### సాంప్రదాయబద్ధంగా యాగశాల ప్రవేశం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు.. కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు దంపతులు..

శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 8 :
శ్రీశైల మహా క్షేత్రంలో మహాశివరాత్రిని పురస్కరించుకని నవాహ్నిక దీక్షతో పదకొండు రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్స ప్రారంభ పూజలు ఆదివారం ఉదయం ఆగమశాస్త్రానుసారం నిర్వహించారు. ప్రారంభపూజలలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు, సంబంధిత అధికారులు, స్థానాచార్యులు ( అధ్యాపక), అర్చకస్వాములు, వేదపండితులు పాల్గొన్నారు.

**యాగశాల ప్రవేశం..**
ఉత్సవ నిర్వహణలో భాగంగా ముందుగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు, కార్యనిర్వహణాధికారి, స్థానాచార్యులు, అర్చకస్వాములు, వేదపండితులు, అధికారులు సంప్రదాయబద్ధంగా ఆలయప్రాంగణంలోని స్వామివార్ల యాగశాల ప్రవేశం చేశారు.

**వేదస్వస్తి..**
ఆలయప్రవేశం చేసిన వెంటనే వేదపండితులు చతుర్వేదపారాయణలు చేసి వేదస్వస్తి నిర్వహించారు.

**శివసంకల్పం..**
వేదపఠనం అయిన వెంటనే స్థానాచార్యుల ( అధ్యాపకులు) వారు లోకక్షేమాన్నికాంక్షిస్తూ బ్రహ్మోత్సవ సంకల్పాన్ని పఠించారు. దీనికే శివసంకల్పం అని పేరు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు, వేదపండితులు సంకల్పపఠనం చేశారు.

**పుణ్యాహవచనం..**
గణపతిపూజ తరువాత పుణ్యాహవచనం జరిపించబడింది. వృద్ధి మరియు అభ్యుదయాల కోసం ఈ పుణ్యాహవచనం జరిపించారు.

**చండీశ్వరపూజ..**
సంకల్పపఠనం తరువాత చండీశ్వరపూజ జరిపించారు. బ్రహ్మోత్సవాలు సృష్టికర్త అయిన బ్రహ్మదేవుని ఆధ్వర్యంలో, క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి పర్యవేక్షణలో, శివపరివార దేవతలలో ఒకరైన చండీశ్వరుని నాయకత్వంలో నిర్వహించబడుతాయని చెప్పబడుతోంది. అందుకే యాగశాల ప్రవేశం తరువాత చండీశ్వరుని ప్రత్యేకంగా పూజాదికాలు జరిపించడం సంప్రదాయం.



యాగశాలలో ప్రారంభ పూజలు చేస్తున్న అర్చక స్వాములు



ప్రారంభ పూజల్లో పాల్గొన్న ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు దంపతులు

**కంకణ పూజ, కంకణధారణ..**
చండీశ్వరపూజ తరువాత కంకణాలకు (రక్షాబంధనాలకు) శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపించబడ్డాయి. తరువాత కంకణధారణ చేశారు.

**ఋత్విగ్వరణం..**
కంకణధారణ తరువాత ఋత్విగ్వరణం జరిపించారు. బ్రహ్మోత్సవాలలో ఆయా వైదిక కార్యక్రమాలు నిర్వహించమని ఋత్విక్కులను ఆహ్వానిస్తూ వారికి దీక్షావస్త్రాలను అందజేసే కార్యక్రమానికే ఋత్విగ్వరణం అని పేరు.

**అఖండస్థాపన..**
ఋత్విగ్వరణం తరువాత అఖండదీపస్థాపన చేయబడింది. అనంతరం వాస్తుపూజ చేయబడింది. తరువాత వాస్తు హోమం నిర్వహించారు.


**రుద్రకలశస్థాపన..**



వాస్తు హోమం తరువాత మండపారాధన చేసి రుద్ర కలశస్థాపన చేయబడింది. కలశస్థాపన తరువాత కలశార్చన జరిపించారు. తరువాత పంచావరణార్చనలు నిర్వహించారు. అనంతరం లోకకల్యాణం కోసం జపానుష్ఠానాలు జరిపించారు..

**అంకురార్పణ..**
బ్రహ్మోత్సవాల మొదటిరోజు సాయంకాలం జరిగే అంకురార్పణకు ఎంతో విశేషముంది. ఈ కార్యక్రమములో ఆలయ ప్రాంగణంలోని నిర్ణీత పునీత ప్రదేశములోని మట్టిని సేకరించి యాగశాలకు తీసుకువస్తారు. దీనినే "మృత్సంగ్రహణం" అంటారు. తరువాత ఈ మట్టిని తొమ్మిది పాలికలలో (మూకుళ్ళలో) నింపి, దాంట్లో నవధాన్యాలను పోసి, ఆ మట్టిలో మొలకెత్తించే పనిని ప్రారంభిస్తారు. ఈ అంకురారోపణ కార్యక్రమానికి చంద్రుడు అధిపతి, శుక్లపక్ష చంద్రునివలే పాలికలలోని నవధ్యానాలు సైతం దినదినాభివృద్ధి చెందాలని ప్రార్థిస్తారు. పాలికలలో రోజూ నీరు పోసి నవధాన్యాలు పచ్చగా మొలకెత్తేలా చూస్తారు. అంకురాలను ఆరోపింపజేసే కార్యక్రమం కాబట్టే దీనికి అంకురార్పణ అని పేరు.

**ధ్వజారోహణ..**
బ్రహ్మోత్సవాలలో మొదటిరోజు సాయంకాలం జరిగే ఈ ధ్వజారోహణకు ఎంతో ప్రాముఖ్యత వుంది. ఆలయప్రాంగణంలో ప్రధాన ధ్వజస్తంభం మీద పతాకావిష్కరణ చేయడమే ఈ ధ్వజారోహణ.ఈ కార్యక్రమంలో ఒక కొత్త వస్త్రం మీద పరమశివుని వాహనమైన నందీశ్వరుని చిత్రీకరిస్తారు. దీనికే నంది ధ్వజపటం అని పేరు. దీనిని ధ్వజస్తంభం మీద కట్టేందుకు నూలుతో చేసిన ప్రత్యేక తాడును సిద్ధం చేస్తారు. తరువాత నందిధ్వజపటాన్ని ఊరేగింపుగా ధ్వజస్తంభం వద్దకు తెచ్చి చండీశ్వరస్వామి సమక్షములో పూజాదికాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోనే భేరీపూజ నిర్వహించారు. ఈ భేరీపూజలో డోలు వాద్యానికి పూజాదికాలు జరిగాయి. తరువాత నాదస్వరంపై ఆయా రాగాల ఆలాపనతో ఆయాదేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. చివరగా ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ఎగురవేశారు.
ధ్వజస్తంభం మీద ఎగిరే ఈ నందిపతాకమే సకల దేవతలకు, యక్ష, గంధర్వ గణాలకు ఆహ్వానం అన్నమాట. ఈ ఆహ్వానంతో విచ్చేసిన దేవతలకు నిర్ణీత స్థలాలు కేటాయించి, రోజూ పద్ధతి ప్రకారంగా వారికి నివేదన సమర్పించారు. బ్రహ్మోత్సవ సమయములో దేవతలంతా క్షేత్రంలోనే వుంటూ ఉత్సవాన్ని తిలకిస్తారని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి ఈ విశేష కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రమేష్ నాయుడు కార్యనిర్వహణ అధికారి ఎం శ్రీనివాసరావు దంపతులు ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ అర్చక వేద పండితులు అధికారులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాల వెలుగులో ఆలయ గోపురాలు



# స్పీడు తగ్గని మెగాస్టార్

సంక్రాంతి బరిలో విడుదలైన 'మన శంకరవర ప్రసాద్‌గారు' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న మెగాస్టార్ చిరంజీవి, ఆ సక్సెస్‌ను ఆస్వాదిస్తూ ఏమాత్రం విరామం తీసుకోకుండా తదుపరి ప్రాజెక్టులపై ఫుల్ ఫోకస్ పెట్టారు. ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు రేపుతున్న బాబీ కొల్లి -- చిరంజీవి కాంబినేషన్ మూవీ (మెగా 158) త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధమవుతోంది.'వాల్తేరు వీరయ్య' తర్వాత ఈ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని, 'మన శంకరవర ప్రసాద్‌గారు' సెట్స్‌లో ఉండగానే అధికారికంగా ప్రకటించడం విశేషం. ప్రీ ప్రొడక్షన్ పనులు దాదాపుగా పూర్తవడంతో, దర్శకుడు బాబీ మార్చి నెల నుంచే షూటింగ్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు సమాచారం.తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం... ఈ చిత్రం తండ్రి -- కూతురు భావోద్వేగ కథాంశంతో రూపొందనుందట. చిరంజీవి కూతురు పాత్రకు మొదట కృతిశెట్టి పేరు ప్రచారంలోకి వచ్చినప్పటికీ, ఇప్పుడు ఆ కీలక పాత్రకు సారా అర్జున్‌ను ఎంపిక చేసినట్లు టాలీవుడ్ వర్గాల్లో వార్తలు వైరల్ అవుతున్నాయి.ఇందులో ఇద్దరు కథానాయికలు ఉంటారని దర్శకుడు ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. ఒక సీనియర్ హీరోయిన్ పేరు ఈ ప్రాజెక్ట్ కోసం బలంగా వినిపిస్తుండగా, మరో హీరోయిన్ ఎంపికపై ప్రస్తుతం మేకర్స్ కసరత్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది.ఈ చిత్రాన్ని కెవిఎన్ ప్రొడక్షన్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. భారీ బడ్జెట్, పవర్‌ఫుల్ ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా తెరకెక్కనుందని టాక్.ఇక ఈ సినిమా అనంతరం మెగాస్టార్ చిరంజీవి, 'దసరా' ఫేం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మరో సినిమాకు కమిట్ అయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల నానితో తెరకెక్కిస్తున్న 'ప్యారడైజ్' చిత్రంలో బిజీగా ఉండగా, ఆ సినిమా విడుదలైన వెంటనే చిరుతో ప్రాజెక్ట్‌ను ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రం మే నెలలో సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.మొత్తానికి...
మెగాస్టార్ 2026 స్పీడ్ చూస్తుంటే అభిమానులకు ఫుల్ ట్రీట్ ఖాయమనే చెప్పాలి!

# వారణాసిలో ట్రూ ఐమ్యాక్స్ మ్యాజిక్

## మహేశ్‌బాబు--రాజమౌళి చిత్రం పై హాలీవుడ్ మీడియాకు సంచలన వ్యాఖ్యలు..

మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం లి'వారణాసి'లిపై హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జక్కన్న పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తాజాగా ఈ సినిమాను ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంపై కీలక వివరాలు పంచుకున్నారు.వారణాసి పుణ్యక్షేత్రం భారతీయుల హృదయాలతో విడదీయరాని అనుబంధం కలిగి ఉందని పేర్కొన్న రాజమౌళి, తెరపై ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించాలనే లక్ష్యంతోనే ఈ చిత్రాన్ని ఆ నేపథ్యంతో తెరకెక్కిస్తున్నట్టు తెలిపారు.'వారణాసి' సినిమా మొత్తం ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో ఉండదని స్పష్టం చేసిన ఆయన, కేవలం కీలక సన్నివేశాలు మాత్రమే ట్రూ ఐమ్యాక్స్‌లో ఉంటాయని చెప్పారు. మిగతా భాగం సాధారణ సినిమా స్కోప్ థియేటర్ల ఫార్మాట్‌లోనే కొనసాగుతుందని వెల్లడించారు.ఈ క్రమంలోనే సినిమా స్కోప్‌లో షూట్ చేసి ఐమ్యాక్స్‌కు మారాలా? లేక మొత్తం ఐమ్యాక్స్‌లోనే తీసి ఆ తర్వాత సినిమా స్కోప్‌కు మారాలా? అనే చర్చలు జరిగాయని తెలిపారు. అయితే రెండు రకాల షాట్లను కలిపి చూపించాలనే ఆలోచన తనకు నచ్చలేదని, ప్రత్యేక సన్నివేశాల సమయంలో ట్రూ ఐమ్యాక్స్ అనుభూతి యథాతథంగా ప్రేక్షకులకు అందించాలనుకున్నానని రాజమౌళి వివరించారు.స్క్రీన్ రేషియోలో మార్పుల ద్వారా ప్రేక్షకులకు మరింత గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వవచ్చని తన నమ్మకాన్ని వెల్లడించిన ఆయన, ఆ అనుభూతి కోసమే ఈ సవాల్‌ను స్వీకరించామని తెలిపారు.

మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న 'వారణాసి' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఉగాది సందర్భంగా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.



# బన్సాలీ విజన్‌లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్



## బాలీవుడ్‌ను షేక్ చేయబోతున్న బన్నీ నెక్స్ట్ స్టెప్..!

'పుష్ప' ఫ్రాంచైజీతో పాన్ ఇండియా స్థాయిలో నేషనల్ వైడ్ సెన్సేషన్‌గా మారిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నెక్స్ట్ అడుగు ఎక్కడ పడబోతుందన్నది ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు సౌత్ హీరోలకు బాలీవుడ్ అంటే ఓ మైలురాయిగా భావించేవారు. కానీ కాలం మారింది. ఇప్పుడు బాలీవుడ్ హీరోలే టాలీవుడ్ వైపు ఆసక్తిగా చూస్తున్నారు.

ఇలాంటి సమయంలోనే బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ -- మన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో సినిమా చేయబోతున్నారనే వార్త నెట్టింట వైరల్ అవుతోంది. భన్సాలీ అనగానే గుర్తొచ్చేవి భారీ సెట్లు, అద్భుతమైన కాస్ట్యూమ్స్, హృదయాన్ని తాకే ఎమోషనల్ కథలు. 'దేవదాస్', 'బాజీరావ్ మస్తానీ', 'పద్మావత్' వంటి చిత్రాలతో బాలీవుడ్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఆయన, ఈసారి అల్లు అర్జున్ కోసం ఓ పవర్‌ఫుల్ సబ్జెక్ట్‌ను రెడీ చేసినట్లు సమాచారం.

గతంలో కొంతమంది టాలీవుడ్ స్టార్ హీరోలు నేరుగా హిందీ సినిమాలు చేసినప్పటికీ అవి ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయాయి. కానీ 'పుష్ప'తో బన్నీ ఇప్పటికే హిందీ ప్రేక్షకులకు చాలా దగ్గరయ్యారు. అక్కడి మాస్ పల్స్‌ను బన్నీకి బాగా తెలుసు. అందుకే భన్సాలీ విజన్ కూడా ఈసారి బన్నీ ఇమేజ్‌కు తగ్గట్టుగానే ఉండబోతోందన్న టాక్ వినిపిస్తోంది.

ప్రస్తుతం అల్లు అర్జున్ డైరీ పూర్తిగా ఫుల్. 'పుష్ప--2' తర్వాత అట్లీ దర్శకత్వంలో ఓ భారీ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లైన్‌లో ఉంది. ఆ తర్వాత సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ ప్రాజెక్ట్ కూడా పట్టాలెక్కనుంది. ఈ రెండు భారీ చిత్రాల అనంతరమే భన్సాలీ -- బన్నీ సినిమా ఉండొచ్చని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

భన్సాలీ చెప్పిన కథకు బన్నీ ఇన్‌స్టంట్‌గా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్న ప్రచారం మరింత హీట్ పెంచుతోంది. ఈ కాంబినేషన్ నిజమైతే.. అది కేవలం ఒక సినిమా మాత్రమే కాదు, ఒక విజువల్ వండర్‌గా నిలుస్తుందన్నది అభిమానుల మాట.

గతంలో బాలీవుడ్ అనుభవాలపై కొంత ఆందోళన ఉన్నప్పటికీ, బన్నీ విషయంలో ఆ భయం అక్కర్లేదని ఫ్యాన్స్ నమ్మకం. ప్రతి విషయంలో పర్ఫెక్షన్ కోరుకునే అల్లు అర్జున్, కథ కొత్తగా ఉంటేనే ఓకే చెప్పే హీరో. అలాంటి బన్నీ భన్సాలీతో సినిమా చేస్తున్నారంటే అందులో ఏదో స్పెషల్ ఖచ్చితంగా ఉండే ఉంటుంది.

ఐకాన్ స్టార్ బాలీవుడ్ ఎంట్రీ ఏ స్థాయిలో ఉండబోతోంది..? ఈ కాంబినేషన్ ఇండియన్ సినిమాను ఏ రేంజ్‌కు తీసుకెళ్తుందో చూడాల్సిందే..!

# మెగాస్టార్ చిరంజీవి మార్గదర్శకత్వంతో 'సీతాపయనం' రూపుదిద్దుకుంది

హీరోగానే కాకుండా దర్శకుడిగానూ తన ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అర్జున్ సర్జా, కొంత గ్యాప్ తర్వాత దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'సీతాపయనం'. భావోద్వేగాలతో నిండిన ఈ చిత్రంలో నిరంజన్, అర్జున్ కుమార్తె ఐశ్వర్య కీలక పాత్రల్లో నటించారు. ఈ నెల 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల సమీపిస్తున్న నేపథ్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో అర్జున్ సర్జా సినిమా విశేషాలతో పాటు ఆసక్తికర అంశాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవికి 'సీతాపయనం' కథ పూర్తిగా తెలుసని, ఆయనకు ఈ కథ ఎంతో ఇష్టమని వెల్లడించారు. కథను విన్న వెంటనే చిరంజీవి తన అభిప్రాయాలను తెలియజేస్తూ, సినిమాలో కీలక పాత్రలకు సరైన నటులను ఎంపిక చేయాలని సూచించారని తెలిపారు. చిరంజీవి ఇచ్చిన సలహాలు ఈ చిత్రానికి గొప్ప బలంగా నిలిచాయని అర్జున్ పేర్కొన్నారు.అర్జున్ మాట్లాడుతూ,"ఈ కథలో ఒక ముఖ్యమైన పాత్ర కోసం చిరంజీవి సూచన మేరకు తమిళ స్టార్ నటుడు విజయ్ సేతుపతిని ఎంపిక చేయాలని భావించాం. ఆయన నటనా ప్రతిభ ఈ పాత్రకు చాలా సరిపోతుందని అనిపించింది. అయితే, ఆయన డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఈ సినిమాలో భాగం కాలేకపోయారు. దాంతో ఆ పాత్రకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు, పాత్ర స్వభావంలో మార్పులు చేసి ఆ పాత్రను నేనే పోషించాల్సి వచ్చింది" అని తెలిపారు.దర్శకుడిగా సినిమాను తెరకెక్కించడమే కాకుండా, కీలక పాత్రలో నటించడం తనకు పెద్ద సవాలుగా మారిందని అర్జున్ అన్నారు. ఒక వైపు దర్శకత్వ బాధ్యతలు, మరో వైపు నటన, రెండింటినీ సమతుల్యం చేస్తూ సినిమాను పూర్తి చేయడం కష్టమైనా సంతృప్తినిచ్చిందని చెప్పారు.'సీతాపయనం' సినిమా కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునేలా, మానవ సంబంధాలు, భావోద్వేగాలు, జీవన ప్రయాణం నేపథ్యంలో రూపొందించామని తెలిపారు. ముఖ్యంగా యువతతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులు ఈ కథతో కనెక్ట్ అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ చిత్రంలో కొత్తదనంతో కూడిన కథనం, సహజమైన నటన, హృద్యమైన సంగీతం ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తాయని అర్జున్ ధీమా వ్యక్తం చేశారు. మెగాస్టార్ చిరంజీవి లాంటి సినీ దిగ్గజం ఇచ్చిన సూచనలు, ప్రోత్సాహం ఈ సినిమాకు మరింత బలాన్నిచ్చాయని ఆయన అన్నారు.ఇప్పటికే టీజర్, ప్రచార కార్యక్రమాల ద్వారా 'సీతాపయనం'పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ నెల 14న విడుదల కానున్న ఈ చిత్రం అర్జున్ సర్జాకు దర్శకుడిగా మరో గుర్తింపు తెచ్చిపెడుతుందనే నమ్మకాన్ని సినీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.